# మయసభ

బోంయ్, బోంయ్ మని సూర్యం హారన్ మ్రోగించాడు. హారన్ మ్రోత వినపడగానే పిలుపందుకుని తోటమాలి రాముడు పరుగు పరుగున వచ్చి ఇనుప కమ్మల గేటు తీయడం మామూలు. బహుశా మేడకు వెనుకవైపున అరటిచెట్లకు నీళ్లు చేది పోస్తున్నాడేమో, రాముడికి హారన్ శబ్దం వినిపించినట్టు లేదు. సూర్యం చిరాకుతో అటూ, ఇటూ చూచాడు. ఆ చూచిన క్షణంలోనే మొండిచేతి ముసలివాడొకడు కొత్తగా సూర్యం జీవితంలో ప్రవేశించడం సంభవించింది.

నల్లటి, తెల్లటి వెంట్రుకలు సమపాళంగా ఉన్న జీబు గడ్డం, బాగా నెరసిపోయిన కనుబొమలు, అగాధమైన లోయల్ని తలపింపచేసె కళ్ళు, కొండకొమ్ములా పైకి లేచిన నాసిక, చవిటి పర్రలా ఎండిపోయిన పెదవులు – పగటిపూట చూస్తే రాత్రివేళ కలలో కనిపించే ఆకారం అది! వేషం కూడా అతని ఆకారానికి తగినట్టే అమరింది! కాషాయాంబరంగా రూపొంది ఎంతకాలమైందో అంచనాకు అందని నాలుగు మూళ్ళ పంచ ఒకటి అతడి మోకాళ్ళదాకా వ్రేలాడుతోంది. చిగుర్లలో ఎండిన మామిడాకు లాంటి శరీరచ్ఛాయను ప్రదర్శిస్తున్న పాతకోటొకటి అతడి శరీరాన్ని అంటిపెట్టుకుని ఉంది.

కారు సరాసరి లోపలికి వెళ్ళిపోయి ఉంటే సూర్యం ఆ ముసలి వాడిని పరిశీలనగా చూడ్డం జరిగేది కాదు. నిజానికది అడ్వొకేటు సూర్యనారాయణ బికారుల్నీ, బిచ్చగాళ్ళనీ చూచి సానుభూతి వ్యక్తం చేయడానికి సమయమూ కాదు. అవతల అతనికి బోలెడన్ని పనులున్నాయి. సరిగ్గా పదకొండు గంటలకు కోర్టులో అతడికోసం కేసొకటి కాచుకుని ఉంటుంది. ఆ లోపల స్నానమూ, భోజనమూ కానిచ్చి నాలుగైదు రిఫరెన్సులు కోట్‌చేసి పెట్టుకోవాలి. ఇంతపని తొందరకు తోడు చంద్రశేఖరం గారు సతీసమేతంగా తీర్థయాత్రకు వెళ్ళదలుచుకున్న యాత్రా స్పెషలుకు ప్రయాణ ముహూర్తం కూడా ఉదయం ఎనిమిది గంటలకు కుదిరింది. వాళ్ళని స్టేషనులో దిగవిడిచి ఎంత త్వరగా ఇల్లు చేరదలచుకున్నా మీనాక్షి సూర్యాన్ని విడిచిపెట్టింది కాదు. చెప్పిందే పదిసార్లు చెప్పడం ఆమె వాడుక. నీరజకు ఇంటి పనులతోనే సరిపోతుంది గనుక పాపనెత్తుకోడానికి ఒక కుర్రాణ్ణి పెట్టుకోమని ఆమె రెండు గంటల వ్యవధిలో పది పదిహేనుసార్లు హెచ్చరించింది. రైలు కదలగానే సూర్యం హుటాహుటిన ఇంటికి బయల్దేరాడు. కారు డ్రైవు చేస్తున్నాడన్నమాటేగాని అతడి ఆలోచనలన్నీ కేసుపైనే వున్నాయి. తను వాదమిలా ప్రతిపాదిస్తాడు, అందుకు ప్రతివాదమిలా ఉంటుంది. అప్పుడు తను ఫలానా పీనల్ కోడ్ నుంచి ఫలానా సెక్షన్ ఉదహరిస్తాడు.... పరధ్యానంలో నుంచి ఉలిక్కిపడి సూర్యం కారుకు సడన్‌బ్రేక్ వేశాడు. అప్పటికీ కారు గేటుకు ఢీకొని రెండు బారలు వెనక్కు వచ్చి మరి కదలకుండా నిలిచిపోయింది. ఎలాగైతేనేం, అదృష్టవశాత్తూ ప్రమాదం తప్పింది!

హారన్ మ్రోగిస్తూ సూర్యం కాలువ ప్రక్కన తూమురాయికి ఆనుకుని నిల్చుని ఉన్న ముసలివాడిని చూశాడు. పరిస్థితుల్ని అర్థం చేసుకుని అతడు తనకు తానే గేటు తెరుస్తాడని కూడా సూర్యం అనుకున్నాడు. కాని అలాంటిదేమీ జరుగలేదు. అదేం చిత్రమో గాని ఆ వృద్ధుడు ఈ విశాల ప్రపంచంలో మునుపెన్నడూ మానవమాత్రుణ్ణి చూచి ఎరుగనట్టు సూర్యం కేసి అబ్బురంగా, కాకుంటే పరీక్షగా చూస్తూ నిలుచున్నాడు.

"ఇదిగో నిన్నే! ఆ గేటు కాస్త తెరవగూడదూ?" అన్నాడు సూర్యం.

ముసలివాడు కారుకు దగ్గరగా వచ్చి కుడిచేయి పైకెత్తి చెవికడ్డంగా తిప్పుతూ తనకు మాటలు వినబడవని సూచిస్తూ సైగచేశాడు.

"పైగా ఇదొకటా! బాగుంది బాగుంది" అనుకుంటూ సూర్యం జేబులో చేయి వేశాడు. ఒక నాలుగణాల కాసు పైకి వచ్చింది. "తీసుకో, తీసుకో" అంటూ సూర్యం చేయిచాచాడు.

అయాచితంగా లభించినా నాలుగణాల రూక కోసం ఆతురతగా దోసిలి పట్టవలసింది పోయి ముసలివాడు ప్రపంచ పటంలో ఏదో మారుమూల పట్టణాన్ని వెదుకుతున్న కాలేజీ విద్యార్థిలా సూర్యం ముఖంలోకి తీక్షణంగా చూస్తూ ఉండిపోయాడు!

సూర్యానికి చిర్రెత్తుకొచ్చింది. కారు దిగి తనే స్వయంగా గేటు తెరుచుకోడం కన్నా గత్యంతరం లేదనిపించి అతడు పైకి లేవబోయాడు. ఇంతలో కిర్రుమని శబ్దం చేస్తూ గేటు తెరుచుకుంది. "జామచెట్టుకు అంటుగడ్తున్నానండీ! హారన్ వినిపించలేదు. అమ్మగారు పిలిచి చెప్పారు" అంటూ, రాముడు క్షమాపణ చెప్పుకున్నాడు.

"దీన్ని తీసుకుని అతన్ని వెళ్ళిపొమ్మని చెప్పు రాముడూ. మరీ ఈ బిచ్చగాళ్ళకు ఆశ ఎక్కువైపోతోంది. ఎంత ఇచ్చినా మరికొంత రాబట్టాలనే చూస్తారు" అంటూ సూర్యం నాలుగణాల కాసును రాముడి చేతిలో వేసి మళ్ళీ కారు స్టార్టు చేశాడు.

✧ ✧ ✧

ఆ రోజు కేసులో సూర్యానికి అత్యద్భుతంగా విజయం చేకూరింది. ప్రతివాది తరపు వకీలు న్యాయవాద వృత్తిలో తల నెరిసిన మనిషి. సూర్యం కనిపించినప్పుడల్లా అతడు పిల్లకాకికేం తెలుసులే ఉండేలు దెబ్బ' అన్న భావాన్ని వ్యక్తం చేస్తూ నిర్లక్ష్యంగా ఓ చిరునవ్వు అతడిపైకి సంధించేవాడు. సూర్యానికా చిరునవ్వు కంటే రంపపు కోత నయమనిపించేది. అలాంటి వకీలు ఈనాటికి ఈ కుర్రలాయరులోనూ కొంత సరుకు లేకపోలేదని గుర్తించగలిగాడు. అంటే ఏమన్న మాట! ఉజ్వలమైన భవిష్యత్తుకు తనీరోజున సుదృఢమైన పునాది వేసుకున్నాడన్నమాట! ఎంత గుండెలు తీసిన బంటయినా ఇక తనంటే జంకక తప్పదు... విజయ గర్వంతో సూర్యం వాలుకుర్చీలో కూర్చుని నీరజ చేతి కాఫీ తాలూకు మాధుర్యంలో వివశుడైపోసాగాడు.

తామరతూడులాంటి చల్లటి చేతిని సూర్యం భుజంపైన వేసి "ఏమండీ! ఈ రోజు అదోలా ఉన్నారు?" అంది నీరజ.

సూర్యం కుర్చీలోకి బాగా వాలి "ఏం లేదు నీరజా! నిద్రలేవగానే నిలువుటద్దం ముందుకనుదుట కుంకుమ బెట్టుకుంటున్న నిన్ను చూచానా! అప్పుడే అనుకున్నాను. ఈ రోజు మన మాటకు తిరుగులేదని! అది కోర్టు కాదు, కురుక్షేత్రమనుకో! కురువృద్ధుడొకటీ, ప్రతిద్వంద్వి రామారావు గారొకటీ కాదు. ఆయన నోటికే తాళం పడిందంటే ఇక చూచుకో!!" అంటూ నీరజను తన ఒడిలోకి లాక్కోబోయాడు.

చేతిని విడిపించుకుంటూ నీరజ కుర్చీ దగ్గరకు లాక్కుని "మీకేం బాబూ! కోర్టుకు వెళ్తారు. కుస్తీలు పడ్తారు. అలాగే క్లబ్బుకు వెళ్ళి ప్రొద్దంతా పోగొట్టుకుని రాత్రి ఏ ఎనిమిదికో తొమ్మిదికో ఇంటికి వేంచేస్తారు. ఈ ఇంట్లో నేను బిక్కుబిక్కుమని ఈగలు తోలుకోవాలి" అంటూ అప్పటికి తనేదో పెద్ద చిక్కులో ఇరుక్కుపోయినట్టు బుంగముఖం పెట్టుకుంది.

భార్యనెలా అనునయించాలో తోచక సూర్యం 'పిన్ని చెప్పినట్టు పాపనెత్తుకోడానికి ఒక కుర్రాణ్ణి కుదుర్చుకుందాంలే నీరజా! నీకు తోడుగా కూడా ఉంటాడు" అన్నాడు.

"కుర్రాడేం తోడండీ, మీరు మరీనూ! అందులోనూ మనింట్లోనా! ఎక్కడి వస్తువులక్కడే ఉంటాయి. ఆ వచ్చే కుర్రాడు కొంచెం చేతివాటు మనిషైతే సరి, కొంప గుండమై ఊరుకుంటుంది అదీగాక పాప కూడా నా దగ్గర లేకపోతే నాకేం తోచదండీ" అంది నీరజ.

"అయితే నీ ఉద్దేశమేమిటి? స్పష్టంగా చెప్పరాదూ!" అన్నాడు సూర్యం. అసలీ ప్రసంగమే అతనికి నచ్చడం లేదు. ఆడవాళ్ళు ఎంత చదువుకుంటేనేమి? వాళ్ళకు అంతర్జాతీయ రాజకీయ వ్యవహారాల కన్నా ఇంటి గొడవలే గొప్పవిగా కనిపిస్తాయని, నీరజ కాపురానికి వచ్చిన నాలుగైదేళ్ళలో సూర్యానికి ఒక నిర్దుష్టమైన అభిప్రాయం కలిగింది.

"బజారుకనీ, మార్కెట్టుకనీ రోజుకైదారుసార్లయినా రాముడు ఊళ్ళోకి వెళ్ళిపోతూంటాడు. వంటావిడ రెండు పూటలా వచ్చి ఒకటి రెండు గంటల్లో తన పని పూర్తి చేసుకుని వెళ్ళిపోతుంది. ఒంటరిగా ఇంట్లో ఉన్నప్పుడు – మీరు నవ్వుతారు, నాకు తెలుసు. పగలు కూడా ఏం దొంగల భయమని మీ ధీమా. కాని నాకేమో భయంగా ఉంటుంది. పట్టపగలే దోపిడీ జరిగినట్లు పేపర్లో వార్తలొస్తున్నాయి. మీకు పుణ్యముంటుంది. పోతే పోతుంది – ఒక ఇరవై రూపాయలు మనవి కావనుకోండి. గేటు దగ్గర కాపలా వాడుంటే నాకేం దిగులుండదు".

ఈ సరిక్రొత్త సలహాని గురించి సూర్యం పూర్తిగా ఆలోచించుకోక మునుపే నీరజ మళ్ళీ ప్రారంభించింది: "మీతో ఎన్నిసార్లు చెప్పినా లాభముండదు. రాముడితో ఒకసారి చెప్పానో లేదో అప్పుడే ఒక మనిషిని తీసుకొచ్చి చూపించాడు".

"అలాగా" అంటూ ఆశ్చర్యం ప్రకటించాడు సూర్యం.

"చెబితే మీరు నమ్మరు! భూతమనుకోండి! మాటలెందుకు? నేనూ ఎందరో ఘూర్ఖావాళ్ళని చూచాను. వాళ్ళీతడి ముందు దిగదుడుపుకైనా పనికిరారు. అలా ఉంటాడు మనిషి! అంతే కాదండోయ్, ఇంకొక విచిత్రం! వాడికి రెండుపూటలా ఇంత తిండి పడేస్తే చాలట! ససేమిరా, జీతం వద్దంటే వద్దంటాడు. "పోనీ ఎందుకైనా పనికొస్తుంది అయిదో పదో తీసుకుందువు లెమ్మన్నాను".

"ఏమైనా ఇంటివిషయాల్లో నీకున్నంత శ్రద్ధ నాకు లేదు నీరజా!" అంటూ సూర్యం తనను కించపరుచుకున్నట్టే భార్యని కొంచెం పైకెత్తేశాడు.

"మరొకటండీ! పాపం! ఆ ముసలాడికి ఎడమచేయి మోచేతి వరకూ లేదు. ఏమైపోయిందని అడిగాను, అక్కడెక్కడో రైస్‌మిల్లులో రెండు నెలలు పనిచేశాట్ట. చేయి చక్రంలో ఇరుక్కుని నలిగిపోయింది. ధర్మాసుపత్రిలో మోచేతివరకూ తీసేశారన్నాడు. అంతటితో అయిందనుకున్నారూ! ఊంహూ. ఒకసారి మలేరియా వస్తే అయిన క్వైనైను మాత్రలన్నీ మింగాడట. దాంతో తీరని చెముడొకటి సంక్రమించింది. చూస్తుంటే గుండెలు తరుక్కుపోతాయండీ యెవడో గానీ!"

"నిజమే, నిజమే" అంటూ గాఢంగా నిట్టూర్చాడు సూర్యం.

"అయితే మీరూ అతన్ని చూచారటండీ?" విస్తుపోతూ ప్రశ్నించింది నీరజ.

"ఉదయం స్టేషన్ నుంచి తిరిగొస్తూ చూచాను. మళ్ళీ కోర్టుకి వెళ్తూ రాముడితో మాట్లాడుతుంటే చూచాను! ఇంతటి పట్టణంలో వాడే మనకు దొరికాడా, లేక మనమే వాడికి దొరికామా అని సందేహంగా ఉంది. అలాంటి వాళ్ళని ఉన్నట్టుండి నమ్మడానికి

వీల్లేదు నీరజా! పోనీలే. నువ్వతడికి ఉద్యోగం కల్పించి ఇచ్చావు. ఇంతలోనే వెళ్ళిపొమ్మనడం ఏం బాగుంటుంది?" అన్నాడు సూర్యం.

"అదేమిటండీ! చూడ్డానికి మోటుగా ఉన్నా అతడు మీరనుకున్నట్టు దుర్మార్గుడుగా కనపడ్డం లేదే?"

"అతడు దుర్మార్గుడు కాదనే అనుకుందాం నీరజా ప్రస్తుతానికి! నాలుగు రోజుల్లో అదే తెలిసొస్తుంది.... పాప అప్పుడే నిద్రపోయిందేమిటి? లేపి అన్నం తినిపించు. నేనయిదు నిమిషాలు రెస్టు తీసుకుని లేచి భోంచేస్తాను" అని చిటికెవేస్తూ ఆవులించి కళ్ళు మూసుకున్నాడు సూర్యం.

✧ ✧ ✧

మరునాడు ఆదివారం. ఎవరో ఒకరిద్దరు క్లయింట్సు వచ్చి మాట్లాడి వెళ్ళిపోయారు. టిఫిన్ అయిన తరువాత సూర్యం పాపను తీసుకుని మేడపైకి వెళ్ళాడు. మేడపైన పడమటి వైపు గదిలోకి కిటికీ తెరిస్తే రోడ్డులో తిరుగుతున్న కార్లు, బస్సులు, రిక్షాలు అన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. పాప చువ్వల్ని పట్టుకుని కిటికీలో కూచుంది. సూర్యం ఏదో వారపత్రిక తిరగవేస్తూ పాప కడ్డంగా కుర్చీలో కూర్చున్నాడు.

"నాన్నా, నాన్నా! అదుగో గడ్డం తాత! చూడూ!" అంది పాప.

సూర్యం తలపైకెత్తాడు. గేటు మూసి వుంది. స్టూలుపైన కూచున్న ముసలివాడు ఇనుప కమ్ముల్లో నుంచి ఆ క్రితం రోజులాగే అదే వేషంతో, అదే పిచ్చివాలకంతో కనిపిస్తున్నాడు.

"మన గేటు దగ్గర గడ్డంతాత కూచోడమెందుకు నాన్నా?"

పాపకు సందేహాలు కలిగితే ఆ తరువాత తన చదువు కొనసాగదని సూర్యానికి బాగా తెలుసు. అతడు పుస్తకం మూసిపెట్టి "తెలీదూ నీకూ? అతను మన ఇంటికి కాపలావాడన్నమాట. ఎప్పుడూ ఆ గేటు దగ్గరుంటాడు. మంచివాళ్ళని మాత్రం లోపలికి రానిస్తాడు. దొంగలెవరైనా వస్తే అతన్ని చూచి భయపడి అలాగే వెళ్ళిపోతారు" అన్నాడు.

"దొంగలు పోలీసోళ్ళకే భయపడరు. గడ్డం తాతంటే వాళ్ళ కొక లెక్కేమిటి? పో నాన్నా నువ్వు! నీకేం తెలియదు" అంటూ నవ్వసాగింది పాప.

సూర్యం తెల్లబోతూ "ఈ దొంగల సంగతులన్నీ నీకెలా తెలిసాయి పాపా" అని ప్రశ్నించాడు.

"అమ్మ చెప్పిందిగా!"

'చెబుతుంది, చెబుతుంది' అనుకుంటూ విసుక్కున్నాడు సూర్యం. కుర్రాళ్లకు వీరగాథలు చెప్పి ధైర్యం, పౌరుషం కలిగించవలసింది పోయి దెయ్యాల కథలూ, దొంగల కథలూ చెప్పి తమనీడని చూచి తామే బెదిరి పోయేటట్టు చేయకూడదని నీరజకు తను వెయ్యిసార్లు చెప్పి ఉంటాడు. కాని ఆవిడ వింటేగా! చెప్పినంతసేపూ విని తను వీధిలోకి పోగానే పాపని పిలిచి, "మరి మావూళ్ళో, అంటే మీ అమ్మమ్మగారి ఊళ్ళో అంభోదర గిడ్డడని ఒకడుండేవాడు. అబ్బ, అబ్బ, ఎంత పెద్ద దొంగనుకున్నావు" అంటూ ఓ కథని ఇతిహాసంగా ప్రారంభిస్తుంది.

ఇంతలో పాప మరొక కొత్త సందేహాన్ని వెలిబుచ్చింది. 'గడ్డంతాత ఎప్పుడూ అక్కడే ఉంటాడన్నావే నాన్నా! మరి అతగాడికి ఆకలేయదూ?"

"ఆకలైనప్పుడు ఇంటికొచ్చి అన్నంతిని, మళ్ళీ అక్కడికే వెళ్ళిపోతాడు".

"అప్పుడు దొంగలు లోపలికొచ్చేస్తే?"

సూర్యం నిరుత్తరుడైపోయాడు. వాదంలో అడ్వొకేటు రామారావుగారినైనా జయించవచ్చును గానీ పాపకు అసందిగ్ధంగా ప్రత్యుత్తరాలివ్వడం కష్టం.

సూర్యం పాపను క్రిందికి దించి "నువ్వు రోడ్డువైపు చూసింది చాలుగాని, హాల్లోకి వెళ్ళి బొమ్మలతో ఆడుకో పాపా" అన్నాడు.

పాప లోపలికి వెళ్ళిపోయింది. సూర్యం పత్రికను టేబిల్‌పైకి విసరి గేటు వైపు చూడసాగాడు. ఆలోచనంటూ ఒకటి పెట్టుకోక పోతే ఏమీ లేదుగాని, అది మనసులో రగలసాగితే మటుకు తనకూ పాపకు కలిగినట్టే ఎన్నో సందేహాలు కలుగుతాయి. నిన్నటి వరకూ ఈ ముసలివాడు తనకు అపరిచితుడు. ఈ పట్టణంలో శాశ్వతంగా మకాం ఏర్పరచుకున్న బిచ్చగాళ్ళు కొందరున్నారు. వాళ్ళు ఏఏ సమయాల్లో ఎక్కడెక్కడ ప్రత్యక్షమౌతారో తనకు బాగా తెలుసు. కాని ఇతన్ని మాత్రం ఇంతకు మునుపు చూచిన జ్ఞాపకం లేదు. బహుశా ఇతడు కొత్తగా ఈ ప్రాంతాలకు విజయం చేశాడేమో? పూర్వాశ్రమంలో ఇతడెక్కడున్నట్టు? ఏం చేసినట్టు? బ్రతుకుతెరువు కోసం కడుపు చేతబట్టుకుని ఇలా వచ్చి ఉంటాడని సరిపెట్టుకుందామనుకున్నా, ఇతడు తనకు ధనరూపకమైన ప్రతిఫలం వద్దంటున్నాడెందుచేత? అవునవును. బొంతపైన చూపు నిలిపిన ఆషాఢభూతులకు గడ్డిపోచలు పనికిరావు.

తోటలోనుంచి గదిలోకి వస్తున్న ప్రభాతవాయువులు శరీరానికి సోకనూ సోకనూ సూర్యం కళ్లు మూతపడ్డాయి. కూర్చున్న కుర్చీలోనే అతడు పది పదిహేను నిమిషాల పాటు కునికిపాట్లు పడి ఆ తరువాత లేచి పక్కనే ఉన్న మంచంపైకి మేను చేరవేశాడు. ఇల్లంతా ప్రశాంతంగా ఉండడం మూలానా సూర్యానికి పడుకోగానే నిద్ర పట్టింది.

నిద్రలో ఒక కలగన్నాడు సూర్యం. చిత్రమైన కల! ఎందుకో ఎక్కడికో తెలియడం లేదు. ఖడ్గహస్తుడై తనొక దుర్గమారణ్యంలో పరుగెడుతున్నాడు. అప్పుడప్పుడు భయంకర మృగాలు, భీకర పన్నగాలు ఎదురౌతూవున్నా వాటిని తను సరకు చేయడం లేదు. ఆఖరుకొక శిథిల దేవాలయం దృగ్గోచరమైంది. దేవాలయాంతర్భాగంలో ఒకచేత ఆసనపాత్రనూ, మరొకచేత మానవ కపాలాన్నీ ధరించి కళ్ళు మూసుకుని కాపాలికు డొకడు 'ఓం, హ్రీం' అంటూ మంత్రం జపిస్తున్నాడు. అతడికెదురుగా పూచిన కడిమి చెట్లు రెండున్నాయి. వాటికి ఓ ఇరవై ఏళ్ళ యువతీ, ఓ నాలుగైదేళ్ళ అమ్మాయీ తీగలతో బంధించబడి ఉన్నారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఆ కాపాలికు డెవడో కాదు! తన ఇంటి కాపలావాడు. బంధితులెవరో కారు. ఒకతె నీరజ, మరొకతే పాప!

ఆ కోపంలో తను ఖడ్గాన్ని పైకెత్తి ఒక్క వ్రేటుతో కాపాలికుణ్ణి తెగవేయ నుంకించాడు. కాని ఇంతలో ఆ నరఘాతకుడు కళ్ళు తెరిచి తనపైకి ఉరికాడు. 'హీనుడా! చూడు నిన్నేం చేస్తానో?' అంటూ మంత్రదండంతో తన తలపైన నొక్క వ్రేటు వేశాడు – ఆ దెబ్బతో సూర్యానికి నిద్రాభంగం కలిగింది. అతడు ఉలిక్కిపడి కళ్ళు తెరుచుకున్నాడు. ఆ దుర్గమారణ్యం, ఆ శిథిల దేవాలయం, ఆ కాపాలికుడు అంతా తన భ్రమ! పగటిపూట కళ్ళు మూస్తే కలత నిద్రలో, లేనిపోని పాడు కలలన్నీ వస్తాయి. అయినా ఇటు జాగ్రదవస్థలోనూ, అటు స్వప్నావస్థలోనూ తన తలపులన్నీ ఆ ముసలివాడిపై ఎందుకిలా ప్రసరిస్తున్నాయి? వాడెవడు, తనెవడు? లోకంలో ఆలోచించుకోడానికెన్నో బృహత్తర విషయాలుండగా మాటి మాటికీ ఈ బికారివాడిని గురించి ఆలోచిస్తూ తన మనసును

పాడుచేసుకోడమెందుకు? ఎవడోగాని ఈ ముసలివాడు తనకొక పీడలా దాపురించాడు!

చిరాకుతో పైకిలేచి సూర్యం అప్రయత్నంగా మళ్ళీ కిటికీ దగ్గరికే వెళ్ళి నిలబడ్డాడు!

ఈసారి ముసలివాడి భంగిమ మారింది. అతడు గేటుకు ఆనుకుని తోట లోపలికి చూస్తున్నాడు. అంతగా తోటలో అతన్ని ఆకర్షిస్తున్నదేదో తెలియక సూర్యం విస్తుపోయాడు. ఇంతలో నందివర్ధనం చెట్ల చాటు నుంచి పాప బయటికి వచ్చింది. ఏ మాత్రం జంకు గొంకులు లేకుండా పువ్వులు కోసుకుంటూ ఆమె గేటుకు సమీపంగా వెళ్తోంది.

ఆక్షణాన సూర్యం బుర్రలో ఒక కొత్త సంశయం పొడసూపింది. దాని తాకిడికి అతడు నిలువునా కంపించిపోయాడు. ఒకవేళ ఈ ముసలివాడు కుర్రాళ్ళనెత్తుకుని పారిపోయే దొంగేమో? అయితే కావచ్చు? ఎవరు చూశారు? లేకుంటే కొరికి తినేద్దామన్నంత ఆకాంక్షతో అతడెందుకలా పాపను చూస్తున్నాడు? చూడ్డమేమిటి? కమ్మీల్లో నుంచి చేయిచాచి అతడు పాపను దగ్గరికి రమ్మని పిలుస్తున్నాడు.

సూర్యం ఎలుగెత్తి 'దొంగ, దొంగ' అని అరుద్దామనుకున్నాడు. కాని నోరు పెగల్లేదు. క్రిందికి దిగి పరుగున వెళ్ళి పాప నింటికి తెచ్చుకుందామనుకున్నాడు. కాని ఆలోపలే ముసలివాడు పాపనెత్తుకుని పారిపోతే? ఏం చేయడానికీ పాలుపోక సూర్యం కిటికీ దగ్గర అలాగే నిలుచుండిపోయాడు.

కాని సూర్యం అనుకున్నంతటి అవాంతరమేదీ సంభవించలేదు. ముసలివాడి కేసి విచిత్రంగా చూస్తూ పాప గేటు దగ్గరికి వెళ్ళిపోయింది. అమాయకంగా అతడినేదో ప్రశ్నించింది. ప్రశ్నకు జవాబు లేదు. ముసలివాడు తన కోటు జేబులో నుంచి ఓ చిన్న అరటి పండు పైకి తీసి పాప చేతిలో ఉంచాడు. కిలకిలా నవ్వి పాప వెనుదిరిగి గంతులు వేసుకుంటూ ఇంటివైపు రాసాగింది. దూరమైపోతున్న పాపను చూస్తూ ముసలివాడు విగ్రహంలా అక్కడే నిలబడి ఉన్నాడు.

✧ ✧ ✧

నాలుగైదు రోజులు గడిచిపోయాయి. ఓ రోజు ఊళ్ళోకి కొత్తగా ఓ సినిమా వచ్చిందని, కాస్త ప్రొద్దుండగానే ఇల్లుచేరుకోమనీ నీరజ పురమాయించినందువల్ల సూర్యం కోర్టు నుంచి నేరుగా ఇంటికి వచ్చేశాడు. కానీ సినిమా ప్రోగ్రాము గురించి సుతరామూ మరచిపోయినట్టు, టేబిల్ క్లాత్ పైన ఏదో కుట్టుకుంటూ కుర్చీలో కూర్చున్న నీరజ ప్రత్యక్షమయ్యే సరికి సూర్యం ముఖంలో చిరుకోపపు ఛాయలు క్రమ్ముకున్నాయి.

"అయినా నీ ధోరణే నీది నీరజా! నన్ను త్వరగా రమ్మనడమేమిటి? నువ్వీ రాచకార్యంలో లీనమైపోవడమేమిటి?" అంటూ చిరాగ్గా వాలుకుర్చీలో కూలబడ్డాడు-సూర్యం.

"మీరింత తొందరగా వస్తారని నాకేం తెలుసండీ! మరచిపోవడాలు మీకు మామూలే కదా! అయినా నా ముస్తాబు కేముంది? ఐదు నిముషాల్లో రెడీ అయిపోతాను. చూడండి" అంటూ నీరజ గబగబా లోపలికి వెళ్ళిపోయింది.

ఎంత త్వరగా తెమిలినా థియేటరు చేరుకునేసరికి ఆలస్యం కావడం, 'అయ్యో, ఇంక కథ అర్థం కావడమెలా'గని విచారించడం నీరజకు పరిపాటే! ఇప్పుడూ అదే జరిగింది. కాని సూర్యానికి మాత్రం కథ అర్థం కావాలని అంత పెద్ద పట్టింపేమీ లేదు. అర్థమైతే కావచ్చు, కాకపోతే అందుకతడు చింతించడు. ఎంతగా వెండితెర అని ఉత్ప్రేక్షించినా అది కేవలం మల్లుగుడ్డే కదా అని సూర్యం విశ్వాసం! ఎంతగా కథ సూర్యాన్ని తనవైపుకు ఆకర్షించుకో జూచినా, బలవత్తరమైన సంఘటనల వల్ల కలిగిన

పతాక పరిణామం ఎంతగా హృదయాన్ని ఉద్విగ్నం చేసిపారవేసినా అడుగడుగునా ఇది కల్పిత గాథేనని మననం చేసుకుని మళ్ళీ మామూలు మనిషైపోతుంటాడు సూర్యం. సూర్యంది ఆదినుంచీ అతి వాస్తవిక దృష్టి!

కాని ఈసారి మాత్రం సూర్యం అంత నిర్లిప్తభావంతో సినిమా చూడలేకపోయాడు. ఆ చిత్రంలో సాత్వికుడైన ఒక నిరుపేద యువకుడు పరిస్థితుల ప్రాబల్యం వల్ల నికృష్టస్థితికి ఎలా దిగజారిపోయాడో నచ్చజెప్పడానికి కథకుడు తీవ్రంగా ప్రయత్నించాడు. ఒకవైపు ఇళ్ళకు కన్నం వేస్తూ, మరొకవైపు ఆ డబ్బును దీనులకూ, హీనులకూ వెదజల్లుతున్న కథానాయకుడి ద్వంద్వవ్యక్తిత్వం చూపరులకు విభ్రమం గొలుపుతోంది. ఓ రోజు రాత్రి ఆ గజదొంగ ఛద్మవేషంతో పురవీధుల్లో విలాసంగా షికారుకు బయల్దేరాడు. అతడి కోమేడ నిర్జనంగా కనిపించింది. దొంగ అక్కడ కొంతసేపు ఆగాడు. తరువాత ఉన్నట్టుండి ప్రాకారకుడ్యంపైకెక్కి చివాలున ఆవలికి దూకాడు. మేడకు పదిగజాల దూరంలో ఉన్న గంగరావిచెట్టుపైకెగబ్రాకి, కొమ్మ చివర దాకా వచ్చి కుప్పించి రెండో అంతస్తులోకి దూకాడు.

"ఇదిగో నీరజా! ఇంటిదగ్గర రాముడు కూడా ఉన్నాడు కదూ?" నీరజవైపుకు వ్రాలి మెల్లగా ఆమె చెవిలో ప్రశ్నించాడు సూర్యం.

"రాముడా! నాలుగ్గంటలకే వెళ్ళిపోయాడే! వాచ్‌మెన్ ఒకడుండగా మళ్ళీ రాము డెందుకండీ ఇంటిదగ్గర?"

కొంప మునిగిందనుకున్నాడు సూర్యం. మారువేషంలో ఈ గజదొంగ ఎలా ఉన్నాడో, తమ ఇంటికి కాపలాకాసే ముసలివాడు కూడా ఇంచుమించు అలాగే ఉంటాడు. ఇక్కడ దొంగ కెలాంటి అవకాశమైతే లభించిందో, అక్కడ ముసలివాడికి సరిగ్గా అలాంటి సదవకాశమే లభించింది. నీరజది ఎలాగైనా ఆడపుట్టుక! అత్యవసర సమయాల్లో తప్ప మిగిలినప్పుడల్లా ఆడవాళ్ళ బుద్ధి చురుకుగా పనిచేస్తుంది. కాని తనుమాత్రం ఏమంత ప్రయోజకత్వాన్ని వెలగబెట్టినట్టు! దొంగకు (అతడు దొంగ కాదని నిదర్శన మేదీ?) ఇల్లప్పగించి తను థియేటరులో కుషనుకుర్చీలో సుఖాసీనుడై నిమ్మకు నీరెత్తినట్టు సినిమా చూస్తున్నాడు! ఒక మనిషిని మరొక మనిషి విశ్వసించడం మంచిదే! కానీ అలా విశ్వసించడానికి ముందు ఈ మనిషి ఆ మనిషితత్వాన్ని అవగాహన చేసుకొని ఉండాలి. ఏనాటి వాయసమో, పంచతంత్రంలో కాబోలు, కులమూ శీలమూ తెలియకుండా కొత్తవాళ్ళని నమ్మరాదంటుంది.

తటాలున పైకిలేచి "కళ్లెందుకో తిరుగుతున్నాయి. నీరజా! కాసేపు బయటవుండి వస్తాను" అని చరచరా థియేటర్‌నుంచి బయటికి వచ్చేశాడు సూర్యం.

అప్పుడప్పుడే సన్నగా చినుకులు జారుతున్నాయి. ప్రగాఢ నీలవర్ణం పైకేసికొన్ని మేఘమాలికలు ఆశాంతాలు అవధులుగా లోకాన్ని ముట్టడించి వేస్తున్నాయి. సూర్యం రోడ్డుపైకి వచ్చేసరికి ఓవైపున మెరపొకటి ధగధగా మెరిసింది. వెనువెంటనే ఒక ఉరుము పెళపెళా ఉరిమింది. రోడ్డులో అతడు నాలుగడుగులు వేశాడో లేదో జల్లుజల్లున జడివాన కురవసాగింది.

వర్షం వస్తోందని వెనకడుగు వేయడానికి సూర్యానికి మనస్కరించలేదు. నిర్జనమైన మేడ. కాకిని వ్రేలాడ గట్టినట్టున్న మేఘాల క్రింద చక్కగా క్రమ్ముకుంటున్న కారుచీకటి, పైగా జడివాన! దొంగతనం చేయడానికి ఇంతకంటే అమూల్యావకాశం ఎప్పుడు దొరుకుతుంది? కారులో బయల్దేరితే ఎట్లా లేదన్నా రోడ్డుపైన ఇంటికి ఒకటి ఒకటిన్నరమైళ్ళ

దూరముంది. సందుల్లో దూరివెళ్తే నాలుగు ఫర్లాంగుల కన్నా ఎక్కువుండదు. అదీగాక రోడ్డులో కారు కనబడేసరికి దొంగ కాలికి బుద్ధిచెప్పడానికి అవకాశముంటుంది. కాదు కాదు; ఎంతవాన కురిసినా సరే తను నడిచే పదినిమిషాల్లో ఇల్లు చేరుకోవాలి!

పల్లాల్లో నిలిచిన బురదనీరు పైకెగిరి మడత చెరగని దుస్తుల్ని ఖరాబు చేస్తున్నా లెక్కచేయకుండా సూర్యం సందుల్లోపడి నడవసాగాడు. వానలో తడుస్తూ నడిచే అనుభవం సూర్యానికి క్రొత్త! అందులోనూ ఏటవాలుగా పడుతున్న వానచినుకులు వడగళ్ళలా ముఖాన్ని మొత్తుతున్నాయి. అదోముఖంగా శరవేగంతో వస్తున్న వర్షధారల మాటకేం గాని, అంతకంటే వేగంగా సూర్యం మనసులో ఆలోచనలు పరుగెత్తసాగాయి. ఐదారు నిమిషాల్లో తను గేటు తెరచుకుని లోపలికి వెళ్తాడు. మేడను సమీపిస్తాడు. సింహద్వారానికి తను వేసుకుని వచ్చిన తాళం ఈపాటికి ఊడదీయబడి ఉంటుంది. నాన్నగారొక రివాల్వరు టేబిల్ సొరుగులో దాచివుంచడం మంచిదయింది. ఒకచేత టార్చిలైటు, మరొకచేత రివాల్వరు పట్టుకుని తను సరాసరి మేడ పైకి వెళ్తాడు. తూర్పువైపు గదిలో దొంగ ఇనప్పెట్టె తలుపు విడదీసే ప్రయత్నంలో నిమగ్నుడై ఉంటాడు. మెరుపులా తను గదిలో ప్రవేశించి, టార్చిలైటును దొంగమీదికి ఫోకస్ చేసి 'హాండ్స్ అప్' అని గర్జిస్తాడు. 'ఊఁ నడు వెనక్కి' అంటూ వాడిని హాల్లోకి తీసుకొస్తాడు. స్విచ్ వేసి, పరుపు చుట్టుకునే త్రాడు ఊడబెరికి దొంగని కంబానికి బంధిస్తాడు!

ఆ క్షణంలో సూర్యం తను సూర్యమే నన్న విషయం మరచిపోయాడు. తనిప్పుడు తిమింగలాలకు భయపడకుండా, తుఫానుల్ని సరకుచేయకుండా సాగరాంతరాళంలోనికి చొచ్చుకుని వెళ్ళి ముత్తెపు చిప్పల్ని వెలికితీసే సాహసికుడు! హిమపాతానికి వెరవకుండా, అలసటను లెక్కచేయకుండా అందుకోవలసిన ఆదర్శంపై చూపు నిలిపి వడివడిగా నడకసాగిస్తున్న పర్వతారోహకుడు!

సందులోనుంచి సూర్యం మళ్ళీ రాజవీధిలోకి వచ్చేశాడు. అక్కడనుంచీ గేటు దగ్గరికి నూరుగజాలు కూడా ఉండదు. సూర్యం మేడవైపోసారి చూచాడు. జడివానలో చూపానడం లేదు. తీక్షణ దృక్కులతో గేటువైపు చూచాడు. అక్కడ మనిషివున్న పొలకువే కనిపించడం లేదు. ఆ ఉద్వేగంలో సూర్యం పిడికిలి మూసి చేతిని పైకెత్తి తన దృఢముష్టి నోసారి చూచుకున్నాడు.

కాని సూర్యం చేయి అప్రయత్నంగా క్రిందికి వ్రాలిపోయింది. పిడికిలి తనంతటదే విచ్చిపోయింది. నిశ్చేష్టుడై అతడు గేటు కావలనుంచి వ్యాపించివున్న రావిచెట్టు కొమ్మలక్రింద నిలబడిపోయాడు. ఒకటి రెండు నిమిషాలపాటు తన చుట్టూరా వాన కురుస్తోందనీ, వానలో తను బాగా తడిసిపోయాడనీ అతడు మరచిపోయాడు. అతడి శరీరంలోని ప్రతి రక్తబిందువులోని ప్రత్యణువునా తన ఎదుట స్టూలు పైన నిశ్చలంగా కూచునివున్న ముసలివాడి పరిదీనస్వరూపమే ప్రతిబింబించింది. చీకటిలో కలిసి చీకటై, తడిసి ముద్దయిపోయి కూడా విసురుగా వీస్తున్న ప్రభంజనంలో, కుంభవృష్టిలో, కదలకుండా, మెదలకుండా కూచుని వున్న ముసలివాడినేనా తను దొంగ అని అనుమానించడం!

అయిదడుగులా పదంగుళాల పొడవున్న తన శరీరం ఆ వృద్ధుడి ధీరోదాత్తత ముందు రెండడుగుల మేరకు కుంచించుకుపోయినట్టు తోచింది సూర్యానికి! అందుకతడు చింతించలేదు. ఆ ముసలాడి మహోన్నత వ్యక్తిత్వం మ్రోల తను మరుగుజ్జయిపోవడమే న్యాయం!

మళ్ళీ ఈ లోకంలో పడ్డాక సూర్యం వృద్ధుడికి దగ్గరావెళ్ళి "తలనొప్పిగా ఉంటే అమృతాంజనం రాచుకుందామని వచ్చాను" అన్నాడు. తీరా అన్న తర్వాత అలా అన్నందుకు కించపడ్డాడు. అమృతాంజనం కోసం జడివానలో తడుస్తూ థియేటరునుంచి తనింతదూరం నడిచివచ్చాడంటే ఎవరు నమ్ముతారు? ఐనా తనిప్పుడెందుకు సంజాయిషీ చెప్పుకోవాలి? నిజానికది సంజాయిషీ కానేకాదు. తన చెవులకే అది క్షమాపణలా ధ్వనించింది.... అంతలో సూర్యం తేరుకున్నాడు. ఏమయితే నేం! ముసలివాడికి తన మాటలు వినిపించి ఉండవు!

సూర్యం గేటు తెరుచుకుని లోపలికివెళ్ళి ఐదు నిమిషాల్లో దుస్తులు మార్చుకుని తిరిగి వచ్చాడు. అప్పటికి వాన దాదాపు వెలిసి పోయింది. అయినా రావిచెట్టు కొమ్మల్లోనుంచి నిర్విరామంగా ఇంతింత నీటిబొట్లు క్రిందికి రాలుతున్నాయి. బాహ్య వాతావరణంలో మార్పు వచ్చినా ముసలివాడు మాత్రం నిర్వికారంగా సమాధిగతుడైనట్లు అలాగే కూచునివున్నాడు. సూర్యం కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. చేతిగుడ్డతో కన్నీళ్ళు తుడుచుకుంటూ సూర్యం క్షణక్షణానికీ మారిపోతున్న తన చిత్తపరివర్తనకు తానే తెల్లబోయాడు. గడచిన ఏడెనిమిది రోజులుగా తనీ ముసలివాడిని గురించి ఇంచుమించు రోజుకొక్క నిర్ణయానికి వచ్చాడు. అనుమానించాడు. అసహ్యించు కున్నాడు. జాలిపడ్డాడు. కడకిప్పుడు కంటతడిబెట్టుకున్నాడు. తనలో ఇన్ని పరిణామాలు కలుగుతున్నా ఎదుటి మనిషిలో మాత్రం కించిత్తు మార్పయినా కనపించడం లేదు. ఇది ఎండిపోయిన మ్రోడు. భూగర్భంలో దీని వేళ్లు చివికిపోయాయి. పైనుంచి క్రిందికి కొమ్మలు క్రమక్రమంగా ఎండిపోతున్నాయి. ప్రకాండంలో తొర్రబడింది. ఈ దుస్థితికి వెనుక ఎలాంటి బలవత్తరమైన కారణం నిక్షిప్తమై ఉందో తనకు తెలియదు. అథవా తెలిసినా తను చేయగలిగిం దేమీలేదు. దేన్ని గురించి విచారించి లాభం లేదో దాన్ని గురించి ఆలోచించడం వృథా ప్రయాస!.... సూర్యం రెండు పొడి బట్టల్ని ముసలివాడిపైకి విసరి, కట్టుకోమని సైగచేసి మళ్ళీ థియేటరు వైపు వెళ్ళిపోయాడు.

మరునాటి ఉదయం. ఇదివరకెప్పుడో నిర్ణయమైన ప్రోగ్రాం ప్రకారం పూరీలో వున్న చంద్రశేఖరం గారికి సూర్యం జాబు వ్రాశాడు. 'పూజ్యులైన తండ్రిగారికి, నమస్కారాలు' అంటూ ప్రారంభించి, 'సౌభాగ్యవతి నీరజ, చిరంజీవి పాప క్షేమంగా ఉన్నా'రని పేర్కొంటూ పిన్ని తృప్తికోసం ఆ కుశలవార్తకు మరి నాలుగైదు వాక్యాలు జోడించాడు. "రోజు కొకటి రెండు సార్లు రాముడే పాపను షికారుకు తీసుకెళ్తున్నాడు. అందుచేత ఆమె నెత్తుకోడానికి ప్రత్యేకంగా కుర్రాణ్ణి పెట్టుకోవలసిన అవసరమేమీ కనిపించడం లేదు. మరొక విశేషం. మనకిప్పుడు నమ్మకస్తుడైన వాచ్‌మెన్ దొరికాడు. పాపం, వాడిస్థితి హృదయ విదారకమైంది. చెవులు వినిపించవు, ఒక చేయి మొండి చేయి. సంవత్సరాల తరబడీ తిండికీ నోచుకోని వాడిలా కనబడుతున్నాడు. రెండుపూటలా ఇంతతిండి పడేస్తే మరే ధ్యాసా లేకుండా ఆ ముసలివాడు మన ఇంటిదగ్గరే ఉండిపోయేటట్టున్నాడు. వాడు గేటు దగ్గర ఉండడం మూలాన నేను క్లబ్బు నుంచి రావడానికి కొంచెం ఆలస్యమైనా నీరజ మరేం కంగారుపడడం లేదు. ఈ విషయం పిన్నితో చెప్పండి".

✧ ✧ ✧

పది పదిహేను రోజులు మెల్లగా దొర్లిపోయాయి. ఈ వ్యవధిలో సూర్యం రెండు మూడు పెద్దకేసులు వకాల్తా పుచ్చుకున్నాడు. వాయిదాలు దగ్గరలో ఉన్నాయి. తిండి తంతు ముగించి న్యాయశాస్త్ర ఉద్గ్రంథాల మధ్య కూర్చుంటే ఒక్కొక్కప్పుడు అర్ధరాత్రి

కూడా మీరిపోతోంది. అప్పుడు పడుకుంటే ఏ ఎనిమిదికో, తొమ్మిదికో మెలకువ వస్తుంది. అప్పుడిక స్నానసన్నాహాలు ముగించుకొని కోర్టుకు చేరుకునే సరికి పార్కులో టవర్‌క్లాక్ పదిగంటలు చూపిస్తుంది.

ఇంతలో సూర్యం గుక్క త్రిప్పుకోడానికి వీలుగా వేసవి సెలవులు వచ్చాయి. ఫైళ్ళన్నీ కట్టగట్టి బీరువాలోకి విసరి సూర్యం విశ్రాంతిగా కాలం గడపసాగాడు. పనిచేస్తే చురుగ్గా చేయడం, బద్ధకిస్తే అత్యవసరమైతే తప్ప, రేయింబవళ్ళూ పడకపైనుంచి లేవకపోవడం సూర్యం అలవాటు. లేదంటే రాజకీయాలపైన ఉన్న పిచ్చివ్యామోహం వల్ల నైతేనేమి, చేబట్టిన వృత్తిద్వారా లభ్యమైన వాక్కండూతి చేతనైతేనేమి సూర్యానికి క్లబ్బుకు వెళ్ళి మిత్రులతో చర్చారూపకమైన వాగ్వివాదానికి దిగకపోతే మరేం తోచేది కాదు! అలా వెళ్ళివస్తున్నప్పుడు గేటు దగ్గర ఆగి ముసలివాడిని పలకరిద్దామని సూర్యం చాలాసార్లు అనుకున్నాడు. ఆగి పలకరించేవాడే! కాని మాటాడ్డానికి ఆ ముసలాడు ఎంతమాత్రం సుముఖంగా కనబడలేదు. పైగా పనిలో చేరినప్పటికీ, ఇప్పటికీ అతడు బాగా చిక్కిపోయాడు. వానలో తడిసిననాటినుంచీ అతడికి కొత్తగా దగ్గొకటి సంక్రమించింది. ఉండి ఉండి ఒక్కసారి దగ్గితే ఆ దగ్గలా ధారావాహినిగా పది పదిహేను నిమిషాల వరకూ ఏకస్థాయిలో కొనసాగేది.

"పన్నెండు గంటలకోసారి మేలుకున్నాను. అప్పుడు ముసలివాడి దగ్గు వినిపించింది" అనేవాడు తెల్లవారగానే సూర్యం.

"నేను తెల్లవారుఝామున మేలకున్నానండీ! అప్పుడు కూడా ముసలాడు దగ్గుతూనే ఉన్నాడు" అనేది నీరజ.

"వాడు మనం మాట్లాడించినా మాట్లాడడు. తనకు ఒళ్ళిలా ఉందని చెప్పుకోడు. ఏమిటో మరి! వీడు మనకొక సమస్యయి పోయాడు".

"దగ్గీ దగ్గీ వాడిక్కడే కళ్ళు మూసుకపోతాడేమోనండీ! ఎక్కడ పుట్టాడో, ఎక్కడ పెరిగాడో? వాడికి భగవంతు డిక్కడ చావు వ్రాసిపెట్టినట్టున్నాడు!"

ఆఖరుకు సూర్యం రాముణ్ణి పిలిచి ముసలివాడి కెలావుందో తెలుసుకోమన్నాడు. అవసరమైతే హాస్పిటలుకు తీసుకెళ్ళి మందిప్పించమన్నాడు.

కాని వెళ్ళిన రాముడు వెళ్ళినట్టే తిరిగి వచ్చి "అతగాడు తనకు మందూ గిందూ ఏమీ ఒద్దంటున్నాడు బాబూ" అన్నాడు.

"ఏం? ఎందుకని?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు సూర్యం.

"ఒంటిపైన చెయ్యివేసి చూశాను. కాలిపోతోంది. లేచి నిలుచోడానికైనా ఓపరికం ఉన్నట్టు లేదు. 'హాస్పిటలుదాకా రా! మందిప్పిస్తాను' అన్నాను"

"అందు కేమన్నాడు?"

"వెళ్ళిపో అన్నట్టు చెయ్యాడిస్తాడు బాబూ! ఇంకేమీ అనడు."

"ఒకవైపు ప్రాణంపోతున్నా మనయింటి దగ్గర కూచుని సత్యాగ్రహం చేయడానికి వాడికి మనమేం అపచారం చేశామట్రా రాముడూ! వెళ్ళు. ఒక బండి తీసుకొచ్చి, వద్దు వద్దన్నా వాడినందులో పడద్రోసి హాస్పిటల్‌కి లాక్కెళ్ళు. స్థితి అపాయకరంగా ఉంది గనుక తప్పకుండా బెడ్ ఇస్తారు. తక్షణం వాడిని హాస్పిటల్లో చేర్చి ఇంకొకపని చూడు. వెళ్ళు" అన్నాడు సూర్యం.

ఆరోజు మధ్యాహ్నానంతరం సూర్యం మండువాలో నుంచి రోడ్డువైపు చూచాడు. ఇనుపకమ్ముల గేటుదగ్గర కాపలావాడు లేడు! లోలోపల ఏదో అవ్యక్తమైన బాధ బాణంలా హృదయాన్ని గుచ్చుకున్నా పైకి మాత్రం తలపైన పెద్దబరువు తగ్గిపోయినట్టు 'అబ్బా' అని నిట్టూర్చాడు సూర్యం.

ఆకులకు సున్నం రాస్తున్న నీరజ సూర్యం లోపలికి రావడం చూచి "ఉదయం మీకొచ్చిన ఉత్తరాల్ని టేబిల్‌పైన ఉంచానండీ" అంది. "నాన్నగారు వ్రాశారేమిటి?" అంటూ సూర్యం జాబుల్ని చేతికి తీసుకుని మంచంపైన పడుకున్నాడు. వాటిల్లో నాలుగైదు కార్డులు, ఒక కవరుమాత్ర మున్నాయి. చంద్రశేఖరంగా రెప్పుడు వ్రాసినా ఒక కార్డులో ముక్తసరిగా మూడు మాటలు మాత్రం వ్రాస్తారు. ఆ నాలుగు కార్డుల్లో మూడు క్లయింట్ల దగ్గరినుంచే వచ్చాయి. ఒకటి చందాగడువు మీరిపోతోందని హెచ్చరిస్తూ ఒకానొక పత్రికా కార్యాలయం నుంచి వచ్చింది. నాన్నగారు జాబు వ్రాయలేదేమో అనుకుంటూ సూర్యం మిగిలిన కవరు పైకి తీశాడు. బహుశా ఎవరో క్లయింటు కేసుకు సంబంధించిన పత్రాలు పంపిఉంటాడని కవరు చించాడు. కాగితాలు పైకి తీశాడు. ఉత్తరమంతటా నాన్నగారి అక్షరాలే ఉన్నాయి. నాన్నగారు సుదీర్ఘమైన ఉత్తరం వ్రాయడం ఇదే ప్రథమం. ఒకవేళ యాత్రానుభవాన్ని గురించి వ్రాశారేమో?

నాలుగైదు పేరాలు మాత్రం చదివి సూర్యం కాగితాన్ని చేతిలో ఉంచుకునే పైకప్పుకేసి చూస్తూ ఆలోచనలో పడ్డాడు. ఆ ఉత్తరమంతా అదోతరహాగా ఉంది! చెప్పవలసిన విషయమంతా ముందే ఉండగా పీఠికాప్రాయంగా వ్రాసుకపోతున్నారు నాన్నగారు. "ఇదంతా ఇప్పుడెందుకు చెప్పవలసి వచ్చిందని నీకు సందేహం కలగవచ్చు. ఇంతకాలంగా నా అంతరాంతరాల్లో నిగూఢంగా దాగివుండిన ఈ రహస్యం నిన్ను మూలమట్టమంగా కదిలించివేయవచ్చు! కాని సూర్యం! నాలో ఎన్నో తర్కవితర్కాలు జరిగినమీదటే ఈ వాస్తవాన్ని నీకు తెలియబరుస్తున్నానని నువ్వు గుర్తించాలి".

సూర్యం ఇంచుమించు కొయ్యబారిపోయాడు. రహస్యమా? ఏమిటది? అది తనని కదిలించేసే వాస్తవమా? అలాంటిదొకటుంటుందని అనుకోడానికైనా అవకాశం లేదే? నాన్నగారేదైనా కథవ్రాసి పత్రికకు పంపించడానికి బదులు తనకు పంపించేశారా? కాదే? పైన చిరంజీవి సూర్యానికి శుభాశీస్సులని స్పష్టంగా వ్రాశారే!

సూర్యం మళ్ళీ ఉత్తరాన్ని చూడసాగాడు. తరువాత ఒకటి రెండు పేజీలవరకూ జాబు వింతగా వేదాంత ధోరణిలో సాగిపోతోంది.

"నీకు తెలుసు సూర్యం. నేనూ నీలా న్యాయవాద వృత్తి అవలంబించిన వాణ్ణి. పదేళ్లపాటు న్యాయమూర్తిగా కూడా పనిచేశాను. ఆ ముప్పై, ముప్పై అయిదేళ్ళ అనుభవంలో నా కవగతమైన సత్యమొక్కటే! న్యాయాన్ని నిర్ణయించడం కంటే ఈ ప్రపంచంలో అసిధారావ్రతం మరొకటి లేదు. ఉదాహరణకి నీకీ రహస్యం చెప్పడం న్యాయమా కాదా అనే నేనీ పది, పదిహేను రోజుల పొడుగునా వితర్కించుకున్నాను. పూరీలో జగన్నాథుణ్ణీ, కలకత్తాలో కాళీమాతను, కాశీలో విశ్వనాథ శివుణ్ణీ, దర్శించుకున్నప్పుడు కూడా ఈ సందేహమే నాలో కొట్టుమిట్టాడింది. కడకు ఈ విషయాన్ని నీకెరిగించడమే న్యాయమన్న నిర్ణయానికి వచ్చాను. ఈ జాబు వ్రాస్తున్నది బృందావనం నుంచి! నిన్న సాయంత్రం ఈ రహస్యాన్ని ప్రకటించడానికి కావలసిన ఆత్మసంయమనాన్ని ప్రసాదించమని నేను కృష్ణభగవానుణ్ణి వేడుకున్నాను.

"నా పరిస్థితిలో ఉన్నవాడు మరెవ్వడైనా అయితే నీకీ విషయాన్ని చెప్పేవాడు కాడేమో? కాని అలాంటివాడు నా కాదర్శం కాదు. నేను లోకం మెరమెచ్చులకోసం ఆశించకుండా నాకు న్యాయమని తోచిన కార్యాలు కొన్ని చేశాను. వాటిల్లో ఇది ఆఖరుదిగా ఉండనీ! ఇదే నా కోరిక.

"మీ పిన్నికి కథలపిచ్చి ఎక్కువ. కనిపించిన పత్రికలన్ని కొనితెమ్మని మొదట కథల్ని మాత్రం చదివేయడం ఇప్పటికీ ఆవిడ అలవాటు. అందులోనూ ఎక్కడో అరుదుగా కనిపించే విచిత్రమైన మానవ ప్రవృత్తి యథాతథంగా చిత్రించబడే కథలంటే ఆమెకు ఎక్కువ అభిమానం. అలాంటి కథల్ని ఆమె చదువగా నువ్వూ, నేనూ అప్పుడప్పుడూ వింటూండేవాళ్ళం. నీకు జ్ఞాపకం ఉందో లేదో గాని ఒకసారి ఆమె ఒక కథ చదివిది. రాక్షసుడిలాంటి మనిషి ఒకడుంటాడు. వాడు చేయని కిరాతక కృత్యాలు లేవు. తనుచేసినవన్నీ దుష్కార్యాలేనని వాడికీ తెలుసు. కాని వాడందుకు పశ్చాత్తాపపడడు. పైగా వాడెన్ని ఘోరకృత్యాలు చేసినా లోకుల్లో వాడి అంతస్తు నానాటికీ పెరిగిపోతుంటుంది. కడకు తనూ కొంతవరకూ ప్రపంచాన్ని ఉద్ధరించినట్లు ఆత్మసంతృప్తితో వాడు చనిపోతాడు. ఈ కథ అసహజంగా ఉందని నువ్వూ, మీ పిన్ని వాదించారు. నేను మాత్రం ఇది సహజమేనని మీకు నచ్చజెప్పబోయాను. కారణం, మీకంటే నేను లోకాన్ని ఎక్కువగా చూచినవాణ్ణి. అదేపనిగా మానవుల్ని హతమార్చిన హంతకులు కొందరు పాప పరిహారార్థం రెండు అశ్రు బిందువులనైనా ధారబోయకుండా ఉరికంబాన్ని సమీపించడం నే నెరుగుదును. వాళ్ళు రాక్షసులు! వాళ్ళతో మనకు ప్రసక్తి లేదు.

"అయితే మానవుల సంగతేమిటి? నా ఎరుకలో ఒక మనిషి ఉన్నాడు. వాడిని నేను దాదాపు నాలుగు దశాబ్దాల నుంచీ చూస్తున్నాను. వాడు సంఘానికి చీడపురుగుగా బ్రతికాడు. మానవతుల శీలానికి ముప్పుగా బ్రతికాడు. నిరంతర దుర్వ్యసనాల్లో ఆస్తిని గుల్లచేసి పారేశాడు. చిప్ప చేతికొచ్చింది కాని వాడు మానవుడు మాత్రం కాలేదు. మానవుడైతే వాడికి పశ్చాత్తాపం కలగదా అనుకున్నాను. వాడిక మానవుడు కాలేడనుకున్నాను. కానీ నువ్వింతలో ఆ మొండిచేతి ముసలివాణ్ణి గురించి జాబు వ్రాశావు. అంతటితో నా అంచనా తారుమారయింది".

సూర్యం త్రుళ్ళిపడ్డాడు. అక్కడికీ, ఇక్కడికీ వచ్చి ఈ మొండిచేతి ముసలివాడు తన కథలోనే ప్రవేశిస్తున్నాడు.

"ఇప్పటికే నా ఈ లేఖ నిన్ను చికాకు పరుస్తోంది గదూ సూర్యం! లేదులే. అసలు విషయాన్నిక డొంకతిరుగుళ్ళు లేకుండా నా చేతనయినంతవరకూ సంగ్రహంగా వ్రాయడానికి ప్రయత్నిస్తాను. ఏకాంతంగా కూచుని తీరిగ్గా చదువుకో".

సూర్యం ఉత్తరాన్ని జేబులో ఉంచుకుని చరచరా మేడపైకి వెళ్ళాడు. గది తలుపులు మూసి కుర్చీలో కూచుంటూ మళ్ళీ కాగితాల్ని పైకి తీశాడు.

✧ ✧ ✧

"అవి నేను క్రొత్తగా కాలేజీలో చేరిన రోజులు. కాని అప్పటికే ఈ ప్రపంచం ఆనందధామమేమీ కాదనీ, కావలసినన్ని కష్టనష్టాల కిక్కడ కొరతలేదనీ నాకు బాగా తెలుసు. మా నాన్నగారు నన్నలా పెంచారు. అందు కాయన్నని లాభం లేదు. పిత్రార్జితంగా దక్కిన ఆస్తిపాస్తులంతగా లేకపోయినా ఆయన అంతవరకూ సంసారాన్ని లాక్కురావడమే గొప్ప విశేషం. బాగా చదివి, డిగ్రీలు సంపాదించి, నేను పెద్ద ఉద్యోగం చేస్తుంటే ఒకసారి

చూచి చనిపోవాలని నాన్నగారప్పుడప్పుడూ అంటుండేవారు. ఆయన కోరికలోని పూర్వాపర భాగాల్లో మొదటిదైతే నెరవేరింది. కాని, రెండోది నెరవేరకముందే ఆయన శాశ్వతంగా కళ్ళు మూసుకున్నాడు.

ఉన్న ఊళ్లోనే హైస్కూలుండడం మూలాన స్కూల్ ఫైనల్ వరకూ నా చదువు మా నాన్నగారికి బరువుగా తోచలేదు. వెనుకాముందూ చూడకుండా రెండువందల రూపాయలు అప్పుచేసి ఆయన నన్ను కాలేజికి పింపించారు. ట్రంకు పెట్టె చేత్తోపట్టుకుని అనంతపురం స్టేషనులో దిగాను. ఆ ఊరి ముఖం చూడ్డం అదే తొలిసారి. కాలేజీ ఎక్కడవుందో వాకబు చేసుకుంటూ వెళ్ళాను. ప్రిన్సిపాలుగారు సాదరంగా మాట్లాడి "ఈ ఊళ్ళో ఎక్కడుండ దలచుకున్నావు?" అని అడిగారు. "అదే తెలియడం లేదండీ" అన్నాను. ఆయన చీటిలో ఒక పేరు వ్రాసియిచ్చి అక్కడికి వెళ్ళమన్నారు.

అది రంగమ్మ హోటలు! ఆ రోజుల్లో ఆ చుట్టుప్రక్కల భోజన ప్రియులందరికీ రంగమ్మ ఆరాధ్య దేవత. హోటలని పేర్కొంటున్నారు గనుక అక్కడ కుర్చీలు, బల్లలు, పటాలు, పంకాలు, సర్వర్లూ, క్లీనర్లూ ఉంటారనుకున్నాను. కానీ అక్కడ అలాంటి గందరగోళమేమీ లేదు. పొరుగూళ్ళనుంచి వచ్చి చదువుకుంటున్న కాలేజీ కుర్రాళ్ళు చాలామట్టుకు అక్కడే భోంచేస్తారు. పైసా చూపిస్తేచాలు. రంగమ్మకు పోయిన ప్రాణం కూడా చక్కాలేచి వస్తుందని లోకంలో ఒక ప్రథ ఉండేది. నూటికి తొంభై మందికి సర్వసామాన్యంగా వర్తించే ఆ మాటకేంగానీ రంగమ్మ పరిచర్యలతోనూ, అంతకంటే మాటలతోనూ వాడుగ్గా తినేవాళ్ళకందరికీ స్వగృహాన్ని మరపించేది! నాలుగైదు రోజులు ఆ హోటల్లోనే ఓ గదిలో మకాం పెట్టి చూచాను. చదువుకోడానికి బొత్తిగా వీలుగా ఉండలేదు. ఎప్పుడూ ఎడతెగని జనం. ఇలా కాదనుకుని ప్రత్యేకంగా ఉన్న ఓ గదికోసం అన్వేషణ ప్రారంభించాను.

ఆనాటికి అనంతపురం ఇప్పుడున్నంత పెద్ద బస్తీకాదు. నాలుగైదు ముఖ్యమైన వీధుల్ని మినహాయిస్తే మిగిలిన ఊరంతా వట్టి మట్టిమిద్దెల మయం. ఈ మట్టి మిద్దెలు డిటెక్టివ్ నవలల్లో అప్పుడప్పుడూ అపరాధపరిశోధకులకు తటస్థించే భూగర్భ గృహాలకంటే ఒకించుకు మెరుగ్గా ఉండే వంతే! ఒకటి రెండు అంకణాల వెడల్పున ఈ వీధినుంచి ఆ వీధివరకూ నూరు నూటయాభై గజాల పొడువునా వ్యాపించి, ఉన్న ఈ మట్టిమిద్దెలకు ఏవైపునగానీ ఓ కిటికీ ఉండదు. ఉత్తర ధ్రువంలో మానవులకు ఆరు నెలలు పగలు, ఆరు నెలలు రాత్రి అని భూగోళం చెబుతుంది. కాని ఈ మట్టిమిద్దెల్లో మనుషులు మాత్రం సంవత్సరమంతా చీకటిలోనే బ్రతుకుతారు. జీవించడమే కష్టసాధ్యమైన ఈ ఇళ్ళల్లో ఇక చదువుకోవడమేం కుదురుతుంది?

నాలుగురోజులు అదే పనిగా తిరగ్గా తిరగ్గా కడకు ఓ మారుమూల వీధిలో గది దొరికింది. పెంకుటింట్లో వీధివైపు గది. గది లోపలికి గాలీ, వెలుతురు వచ్చే అవకాశాలున్నాయి. మాటి మాటికీ గదిలోకి వచ్చి అల్లరి చేయడానికి ఆ ఇంట్లో కుర్రాళ్ళు కూడా లేరు. కుర్రాళ్ళే ఏమిటి, మగవాళ్ళు కూడా లేని ఆ ఇంట్లో ఇద్దరు ఆడవాళ్ళు మాత్రం ఉన్నారు. ఊతకర్రసాయంతో ముసలావిడ రోజుకొకటి రెండుసార్లయినా వీధిగడపదాకా వచ్చి నన్ను పలకరించి వెళ్ళేది. ఆవిడకు పగలుమాత్రం ప్రపంచం మసక మసకగా కన్పిస్తుంది. రాత్రులు అదీలేదు! పెరట్లోకి ప్రత్యేకంగా దారిలేకపోవడం చేత ముఖం కడుక్కోడానికీ, స్నానం చేయడానికీ ఇంటిలోపలి నుంచే వెళ్ళవలసి వచ్చేది.

లోపలికి వెళ్ళినప్పుడల్లా నడవలో మంచంపైన పడుకునివున్న ముసలావిడ "ఎవరూ, ఎవరూ" అంటూ కంగారుగా ప్రశ్నించేది. "నేనేనవ్వా! చంద్రాన్ని" అనేవాణ్ణి. "ఒసే జానకీ! అబ్బాయికి నీళ్ళు కావాలేమో, తొట్లో ఉన్నాయేమో చూడు" అంటూ ఆవిడ కూతురికి పని పురమాయించేది. ఆ అమ్మాయి తొట్లో నీళ్లు ఉంటే ఉన్నాయనేది లేకుంటే మారుమాట చెప్పకుండా నీళ్ళు చేదిపోయడానికి గజ్జెల గుర్రంలా నడుస్తూ పెరట్లోకి వెళ్ళిపోయేది. ముక్కూ మొగం ఎరుగనివాళ్ళచేత పనులు చేయించుకోడానికి నాకు బొత్తిగా మనస్కరించేది కాదు. అయినా అడ్డుచెప్పలేక జానకి నీళ్ళు చేది పోసేంతవరకూ ముసలావిడతోనే మాట్లాడుతూ ఉండి ఆ తరువాత పెరట్లోకి వెళ్ళేవాణ్ణి.

ఓరోజు నేను కాలేజినుంచి రావడానికి ఆలస్యమైంది. నా కోసం వీధి గడప దగ్గరే కాచుకునివున్న ముసలావిడ "ఏం నాయనా, ఈ రోజింత వేళ మీరి వచ్చావు?" అంది. కారణం చెప్పాను. "ఏమో బాబూ! రోజూ ప్రొద్దుండగానే ఇల్లు చేరుకునే వాడివి. ఈ రోజు రాకపోయేసరికి దిగులేసింది. ఇది మగదిక్కులేని ఇల్లయిపోయే! ఏ అమ్మగన్నబిడ్డవో, నువ్వు మాలో ఒకడివిగా మసలుకుంటున్నావు. ఈ రోజు మా అబ్బాయికి తిథి చేశాను. బ్రతికుంటే వాడీపాటికి ఒక ఇంటివాడై జానక్కి కూడా పెళ్ళిచేసి ఉండేవాడు. రోగమా, రొష్టా? ఏమీ లేదు. ఆ దేముడికి కళ్ళు కుట్టినయ్. తీసుకెళ్ళిపోయాడు. వాడికి జానకంటే పంచప్రాణాలు. అయ్యా లేకపోయె, అన్నా లేకపోయె. నేనున్నా లేనిదానిక్రిందే జమ. దాని అభం, శుభం ఎవరు చూస్తారు?"

జీవిత ప్రవాహంలో అనేక సుడిగుండాల్లో పడి మునిగి తేలి గుక్కతిప్పుకున్న ఆ ముసలావిడను నేనేమని ఓదార్చగలను! అయినా ఆమె తృప్తికి "అవును పాపం, నిజమే మరి" అంటూ నిట్టూర్చాను.

"బ్రతికుండి వాడు తన అత్తగారింటికి వస్తే వాడికి ఏరికోరి వంటకాలు చేసిపెట్టవలసింది జానకి. వాడి కేదేది ఇష్టమో నాకంటే దానికి బాగా తెలుసు. పిచ్చిపిల్ల! వద్దన్నా ఈ రోజు అవన్నీ చేసింది. దాని పిచ్చిగానీ, వాడొచ్చి తినబోతాడా బాబూ!

ఈ ఆవేదన ఉపశమించడానికి ఏం చెప్పాలో నాకు బుర్ర చించుకున్నా స్ఫురించలేదు.

"పోనీ ఈపూట నువ్వు హోటలుకు వెళ్ళకపోతే నేం బాబూ! ఇక్కడే భోంచేయగూడదూ!"

"దానికేం అవ్వా! తప్పకుండా భోం చేస్తాను" అన్నాను.

ముసలావిడ మెల్లగా లేచి గోడవెంబడే నడవలోకి వెళ్ళి మంచంపైన కూచుంది. నేనూ నడవలోనే భోజనానికి కూచున్నాను. జానకి పళ్ళెంలో అన్నం తెచ్చింది.

"మహారాజు, ఆయన చనిపోయినా మాకంతో ఇంతో మిగిల్చి పోయాడు. ఈ ఇల్లూ, వాకిలీగాక నాలుగ్గెదెకరాల పొలముంది. కాలుమీద కాలువేసుకుని ఇంట్లో కూచున్నా నాలుగయిదొందల రూపాయల ఆదాయ మొస్తుంది. ఇది గాక వున్న నగానట్రా ఉండనే ఉంది. సంబంధం కుదిర్చి పెట్టి ముందు నిలిచి శుభకార్యం చేసేవాళ్ళే లేంది!"

"ఆ గడియవస్తే సంబంధం తనంతటదే వెదుక్కుంటూ వస్తుంది" అని ప్రయత్నించి ఓ మాటన్నాను.

కొంతసేపు పరధ్యానంగా ఉండిపోయిన తర్వాత ముసలావిడ "అన్న కేంకావాలో చూస్తున్నావా జానకీ" అంది.

"ఆకులో మొదటవేసిన అన్నం ఇంకా అలాగే ఉంది" అంది జానకి. అప్పటికి నేనేదో అపరాధం చేసినట్టు.

"ఇదీ మరీబాగుందవ్వా! జానకిని వృకోదరుడిలాంటి వాడికెవరికైనా కట్టబెట్టాలి! లేకుంటే అతగాడు మొదటవేసిన అన్నమైనా పూర్తిగా తిని నిభాయించుకోడం కష్టం" అన్నాను.

జానకి కిలకిలా నవ్వుతూ రెండోదఫా పళ్ళెం నిండుకూ అన్నం తెచ్చింది.

జానకి అంత పొడుగరీ కాదు; పొట్టీ కాదు. నీటి కెద్దడిలేని బావిక్రింద, పుష్టిగా సత్తువ గలిగిన నల్లరేగడి పొలంలో గుమ్మటంలాగా పెరిగే అరటిచెట్టులాంటి అంగసౌష్టం ఆమెది! నిజానికి జానకిదేమంత అపురూపమైన సౌందర్యం కాదు. అంత మాత్రం రూపవతులు మనకెక్కడైనా కనిపిస్తారు. సౌందర్యం కన్నా ప్రధానంగా ఆమె చూపుల్లోనూ, మాట్లాడే తీరులోనూ ఎదుటివారికి కొట్టొచ్చినట్లు కనిపించేది ఆమె అమాయకత్వం. హృదయంలోనుంచి పెల్లుబికిన భావాన్ని గళంలోనే మింగి, మెరుపులా హఠాత్తుగా ఉద్భవించే దరహాసాన్ని పెదవులపైకి వచ్చీరాకముందే తుడిచిపెట్టి తెచ్చికోలు అభినయంతో కృత్రిమంగా ప్రవర్తించడం జానకి బొత్తిగా చేతగాదు. ఆమె ఏమాట చెప్పినా అది భూగర్భంలో నుండి అప్రయత్నంగా పైకి ప్రసరించే జలధారలా, స్వచ్ఛంగా రమణీయంగా ధ్వనిస్తుంది. ఎంత మాత్రం ఛలోక్తి కయినా ఆమె గలగలా నవ్వేస్తుంది. ఆ నవ్వు శరత్కాల కౌముదిలా చల్లగా, తెల్లగా విరిసి ఎదుటివారికి హాయిహాయి అనిపిస్తుంది. పది పదిహేను రోజులకు ముందు జానకి నాకు క్రొత్త; నేను జానకికి క్రొత్త. కాని ఆమాటా, ఆ నవ్వూ ఈ స్వల్ప వ్యవధిలో కొత్తదనాన్ని మటుమాయం చేసి పారేశాయి.

"అమ్మాయీ, జానకీ!" అని సంబోధించేవాణ్ణి తమాషాకు.

"ఏమండీ అన్నయ్యగారూ!" అంటూ జానకి వాగ్వాదానికి సిద్ధమయ్యేది.

"మరేం లేదు. ఈ రోజొక పెళ్ళి సంబంధం చూచానులే" అంటూ ఆమె ఉడుకుమోత్తనం ఎలా వ్యక్తపరుస్తుందోనని నిలువెల్లా కళ్ళుచేసుకుని ఆమె వైపు చూస్తూ ఉండిపోయేవాణ్ణి.

"చూస్తారు, చేస్తారు! చూడకేం అప్పో, సప్పో చేసి తమర్నింత దూరం పంపించింది ఇక్కడెవరికో పెళ్ళి సంబంధాలు చూడ్డానికి కాదు. గుట్టుగా చదువుకోండి".

"అది కాదు జానకీ! మరి నీకు నేను చూచిన వరుడున్నాడు చూచావూ, అతడు అమాంతం నీ తలకాయంత యినపగుండును ఇరవైబారల దూరానికి విసిరి పారేస్తాడు! వాడి ఛాతీవుందిరా బాబూ, ఫిరంగులు పెట్టి కాల్చుకోనీ, చెక్కుచెదరదు. అంతే కాదులే జానకీ! వాడి భోజన పరాక్రమం కూడా చెప్పుకోదగ్గదే! నువ్వు ఒక దానవెంబడి ఒకటిగా ఐదు విస్తర్లువేసినా ఊఁ ఆఁ అనకుండా అన్నీ ఖాళీచేసిగానీ లేవడు".

చిరుకోపం ముఖంలో పరవళ్ళు త్రొక్కగా, ఒక్క విసురున పైకిలేచి ముందుకుపోయి ఈ భుజం మీదినుంచి ఆ భుజంమీదికి విల్లులా పడుతున్న పొడుగాటి జడను వెనక్కి తీసుకుంటూ జానకి తల్లి దగ్గరకు వెళ్ళి "చూడవే అమ్మా! అన్నయ్య ఎవర్నో బకాసురుణ్ణి తీసుకురాబోతున్నాడు" అంటూ ఏడుపు ముఖం పెట్టేది.

"అదేమోనమ్మా! మీ అన్నా, నువ్వూ పడండి. లేవండి! నాకు తెలియదు. అతడు బకాసురుణ్ణి తెచ్చినా సరే, భీముణ్ణి తెచ్చినా సరే. నువ్వు పెళ్ళి చేసుకోవలసిందే". ముసలావిడ తన తీర్పు తేల్చి చెప్పేసేది.

"చేసుకుంటాలే మీరు చూద్దురుగానీ! ముందు అట్లకాడ పొయిలో పెట్టి నాలుగు వాతలు తీస్తాను. ఎంత భీముడైనా ఒళ్ళు కాలి నోరు బాదుకుంటాడు".

◇ ◇ ◇

ఓ రోజు సాయంత్రం ప్లే గ్రౌండునుంచి ఇంటికి వచ్చి, స్నానం చేయడానికి పెరట్లోకి వెళ్ళాను. తొట్టిలో నీళ్ళు లేవు. నాకెందుకో కోపం వచ్చింది. చేదను బావిలో వేసి చేంతాడు జారవిడుస్తున్నాను. చేద దరికి తగిలిన శబ్దం వినిపించిందేమో, జానకి లోపలినుంచీ పరుగెత్తుకుని వచ్చింది.

"అదేమిటి? ఎప్పుడూలేని వాడుక!"

నేను వెనుదిరిగి చూడలేదు. నాపాటుకు నేను నీళ్లతోడి తొట్లో పోస్తున్నాను.

"పోసింది చాలు. ఇక స్నానం చెయ్యొచ్చు" అంది జానకి.

చేత చెంబు తీసుకుని తొట్లో ముంచబోయాను. పట్టిగాల్లో చెంబేం మునుగుతుంది! తొట్లో ఒక్కచుక్క నీళ్ళు కూడా లేవు.

"అబ్బాయిగారి కలాగే కావాలి! కోపమొస్తే మాత్రం క్రింద తూము మూసిందీ లేందీ చూచుకోవద్దూ" అంటూ జానకి తూము మూసి తరువాత చేద చేతికి తీసుకుంది.

"నా కోరిక మీద కోపమెందుకొస్తుంది?" అన్నాను.

"ఎందుకొచ్చిందో చేదనడిగితే తెలుస్తుంది. పాపం, అది కుయ్యో, మొర్రో అని మొత్తుకుంటుంటే పరుగెత్తొచ్చాను".

"అయితే నువ్వు చేద ఏడుస్తోందని పరుగెత్తొచ్చావు గాని, నేను బాధపడుతున్నానని కాదు!"

"అయ్యో! ఎవ్వారమా! ఇవేం ఎత్తిపొడుపులమ్మా! ఇలా రాచి రంపానబెడితే ఆ రాబోయే వదినగారి గతి ఏం కావాలో ఏమిటో?"

రాబోయే వదినగారిని గురించి మాట్లాడ్డమంటే జానకికి సరదా! ఆమె నోటంట ఆ మాటలు వినడానికి నాకూ సరదాగానే ఉండేది! అసలు జానకిని చూచిన తర్వాత నేననుకుంటాను. నాకు పెళ్ళి చేసుకోడం కూడా ఒక మంచిపనేనన్న అభిప్రాయం కలిగింది. జానకి లాంటి సహచారిణి దొరికితే ఎలాంటి దుర్గమపథంలోనైనా సునాయాసంగా ప్రయాణం చేయవచ్చు. కాని జానకిలాంటి అమ్మాయి దొరకడమే దుస్తరం! అలాంటివాళ్ళు నూటికీ కోటికీ ఒకరుంటారో, ఉండరో!

దసరాలోనూ, క్రిస్మస్‌లోనూ రెండుసార్లు ఊరికి వెళ్ళి వచ్చాను. వారానికోసారైనా జానకి ఊరికి ఉత్తరం వ్రాసేది. క్రిస్మస్ సెలవుల చివరిరోజుల్లో జానకి దగ్గరినుంచి ఓ ఉత్తరం వచ్చింది. అందులో ఈసారి నేను అనంతపురం వచ్చిన మీదట హోటలు తిండి మానేయాలనీ, అలా మానకుంటే గదైనా ఖాళీ చేసేయాలనీ తన తల్లి నిక్కచ్చిగా చెబుతున్నట్టు ఆమె వ్రాసింది. ముసలావిడ అలాంటి నిర్ణయానికి రావడంలో ముప్పాతికమువ్వీసం బాధ్యత జానికిదై ఉంటుందని నాకు తెలుసు. కాని నేనెందుకో చొరవ తీసుకుని ఆ తల్లికూతుళ్ళు చెప్పినట్టు చేయలేకపోయాను. "ఎలాగా వారానికి రెండు మూడు పూటలు ఇక్కడే భోం చేస్తున్నాను. ఇక స్నానపానాదులన్నీ మీరే చూచుకుంటున్నారాయె. అయినా నాకేం అభ్యంతరం లేదు. కాని నాన్నగారు నా మూలంగా ఒకరికి శ్రమ కలిగితే ఒప్పుకోరు" అని వాళ్ళకు నచ్చ జెప్పుకున్నాను.

మార్చి నెల సమీపం కావస్తోంది. చదువుల గొడవలో మునిగి పోయినందువల్ల మునపటిలా జానకితో మాట్లాడ్డానికి తీరకయ్యేది కాదు. కాని వీలుచిక్కినప్పుడల్లా జానకి గదిలోకే వచ్చేసేది. ఆ ఇంట్లో కుర్రాళ్ళు లేనందువల్ల నెమ్మదిగా చదువుకోవచ్చునని మొదట నేనాశించాను. కాని మాటల్లోనూ, చిలిపితనంలోనూ ఒక్క జానకే పదిమంది కుర్రాళ్ళ పెట్టు! "బొత్తిగా తలగడ లేదన్నయ్యా! ఈ పుస్తకం తీసుకుపోతున్నా" అంటూ ఆవిడ నా ఇండియన్ హిస్టరీ వాల్యూమును చేతికి తీసుకునేది. "పరీక్షలొచ్చేస్తున్నాయి జానకీ, నీకు పుణ్యముంటుంది దాన్నక్కడ పెట్టి వెళ్ళు" అని ప్రాధేయపడేవాణ్ణి.

"ఇన్ని పుస్తకాలున్నాయె, యివన్నీ చదివితే చాలాదూ" అంటూ జానకి కిటికీకి ఎదురుగా కూచునేది. నేను పుస్తకం మూసిపెట్టి "వంటాగింటా మాని నువ్విక్కడి కెందుకొచ్చావో. ఒకటి రెండు మాటల్లో చెప్పెయ్ జానకీ! నేను చదువుకోవాలి" అనే వాణ్ణి.

"ఇన్ని పుస్తకాలు చదువుతావు కదా! ఒక కథ చెప్పగూడదూ పోనీ".

"వీటిల్లో కథలుండవు జానకి! అంతా చరిత్ర".

"పోనీ ఆ చరిత్రే కొంచెం చెప్పన్నయ్యా! వింటాను".

నేను పక్కున నవ్వేసేవాణ్ణి. జానకీ నాతోబాటు నవ్వేది. వీధెంట వెళ్ళేవాళ్ళు మమ్మల్ని ఆశ్చర్యంగా చూచేవాళ్ళు. ఇరుగింటి పొరుగింటివాళ్ళేమనుకునేవారో నాకు తెలియదు. కాని జానకి ఎవరినీ లెక్కపెట్టేది కాదు.

ఆ తల్లీ కూతుళ్ళని చూస్తుంటే ఆ కుటుంబానికీ, మిగతా ప్రపంచానికీ మధ్య లంకె లెప్పుడో విచ్ఛిన్నమైపోయినట్లు తోచేది. ఒకవిధంగా వాళ్ళది ఒంటరి జీవితం. జానకి మేనత్తగారు ఆ ఊళ్ళోనే ఉన్నారు. ముసలావిడ మాటల్లో ఒక్కొక్కప్పుడు ఊళ్ళో నాలుగో వీధిలోనే ఉన్న ఆ బంధువులని గురించి ప్రసక్తి తెచ్చేది. వాళ్ళు కొత్తగా కారు కొన్నారు. మేడ కట్టించారు. పెద్ద వ్యాపారం సాగుతోంది. ఆ మేనత్తకు ఒకే ఒక కొడుకున్నాడు. కాపురాలు రెండూ ఒకే ఛాయలో ఉన్నప్పుడు అతడికి జానకిని చేసుకోవాలని వాళ్ళు చెబుతుండేవారు. నడుమంతరపుసిరిలో ఆ బంధుప్రేమ మండుటిసుకలో జలకణంలా ఇంకిపోయింది. వాళ్ళిప్పుడీ ఊళ్ళో బంధువులున్నారని భావించడమే లేదు.

"వాడిని నువ్వు ఎప్పుడైనా చూచేవుంటావు చంద్రం! మరేం పనిలేదు. వీధుల్లో తిరుగుతుంటాడు. వాడి సంగతి నేను చెప్పడం బాగుండదు. ఊళ్ళో ఎవర్నడిగినా నీకు తెలుస్తుంది. వాసు వస్తున్నాడంటే ఇక వయసు ఆడపడుచులు ఇళ్ళల్లో దూరి గడెవేసుకుంటారు" అనేది ముసలావిడ.

"ఎవరెట్లాపోతే మనకేమే అమ్మా! అతగాడైనా ఈమధ్యనేగా ఇంత అధ్వాన్నంగా తయారైంది! అయినా ముక్కుదాడు లేకపోతే కోడెదూడ చెప్పినమాట వింటుందీ?" అంటూ చర్చల్లో పాల్గొనేది జానకి.

"ముకుదాడుకేం! నువ్వున్నావుగా! నీకంటే మంచి ముకుదాడు ఎక్కడ దొరుకుతుంది జానకీ! నేను చెబుతున్నా నవ్వా. ఆ కోడెకు ఈ ముకుదాడు తగిలిస్తే పొగరణిగిపోతుంది" అంటూ నేను ఉచితంగా సలహా ఇచ్చేవాణ్ణి.

"నేనైతేనా! చెవులు నులిమి గదిలో కూలదీసి అతగాడిచుట్టూ గిరిగీసేదాన్ని! ఏమనుకున్నావో!"

అదేం ఆత్మవిశ్వాసం! ఈ ప్రపంచంలో తనకు అసాధ్యమైన పనంటూ ఒకటి లేనేలేదనుకుంటోందా ఈ జానకి! ఏమో, నా కర్థమయ్యేది కాదు.

ఆత్మవిశ్వాసం సంగతలాఉండగా ఆమె ఇతరుల్ని కూడా అంత దృఢంగానే విశ్వసిస్తుంది.

అదే ఆమె కొంప ముంచింది.

✧ ✧ ✧

సంక్రాంతి పండుగ తర్వాత నాలుగైదు రోజులై ఉంటుంది. ఆ రాత్రి బాగా ప్రొద్దు పోయేంత వరకూ చదువుతూ ఉండిపోయాను. తాలూకా కచ్చేరిలో జవాను పన్నెండు గంటలు కొట్టాడు. నాలుగ్గంటలకు అలారం పెట్టి, దీపం చిన్నది చేసి చాపపైన పడుకున్నాను. ఇంకా తల్లో గ్రీకుదేశ రాజకీయ కల్లోలాలు, ఆంగ్లేయుల గులాబీపూల యుద్ధాలు, హిందూదేశంలో మహమ్మదీయ దండయాత్రలు కలగాపులగంగా సుళ్ళు తిరుగుతున్నాయి. నిద్రాదేవి పూనకంలో క్రమక్రమంగా బుర్రవేడి తగ్గుతోంది. ఇంకొక అయిదు నిమిషాల్లో గాఢంగా నిద్రపట్టిఉండేదేమో? వీధి మెట్లపైన ఏదో శబ్దం వినిపించింది. ఎవరిదో పదధ్వని! అదే వీధిలో అప్పుడప్పుడూ దొంగతనాలూ జరుగుతుంటాయి. కాస్త జాగ్రత్తపడడం ఎందుకైనా మంచిది. దీపం హెచ్చించడానికి చేయిచాచాను. కాని లాంతరు చేతికింకా ఒక మూర దూరంలో ఉండిపోయింది. నేను పడుకున్న గదికి ఎదురుగా వరండా ఉంది. వరండాలో గదికి ప్రక్కగా పాతకాలంనాటి నగిషీ పనుల ద్వారాబంధమూ, గడ్డపారకైనా భయపడని తలుపూ ఉన్నాయి. సింహద్వారానికి అటువైపున రెండు గజాల్లో లోపల గదివైపుకు తెరచుకునే రెండు తలుపుల కిటికీ ఒకటి ఉంది. కిటికీకి బలమైన కమ్ములున్నాయి. వీధివైపు నుంచి దొంగ ఇంట్లో ప్రవేశించడం అసాధ్యం. కంగారుపడి ఆ వచ్చిన దొంగను బెదరగొట్టడమెందుకని దీపం పెద్దది జేసే ప్రయత్నం మానుకున్నాను.

గదిలో పడుకునే, వరండాలో ఏం జరుగుతోందో తెలుసుకోడానికి నాకు గుడ్డి దీపం కూడా కొంత సహకరించింది. మూడు చెక్కలతో బిగించబడిన గది తలుపులో చెక్కకూ నడుమ సందులున్నాయి. ఆ సందుల్లోనుంచి దీపపు వెలుగు వరండా చివరవున్న గోడపైన పడుతోంది. ఉన్నట్టుండి ఆ కాంతికిరణాలకు అవరోధం తటస్థించింది. సందేహం లేదు. అదొక మానవాకారం!

కిటికీదగ్గర నిలబడి కమ్ముల్లోనుంచి గదిలోపలికి చూస్తున్నాడు. ఎవరో? ఎందుకో? నా కవగతం కాలేదు.

"జానీ! జానీ!" పిలుపు చాలా తేలిగ్గా వినిపించింది.

అయితే వాడెవడో జానకికి పరిచితుడేనన్నమాట! ఎవడు వాడు? వాడి గొంతు నులిమేస్తే బాగుండును. ఎముకలు విరిచి వాడి శరీరాన్ని ముద్దజేసి ఫుట్‌బాల్లా ఆకాశానికి ఎగురతంతే ఇంకా బాగుండును.

ఇంతలో గాజులు గలగల మన్నాయి.

"ఏమిటిది? ఎందుకూ?" జానకి గొంతు.

"తలుపుతియ్..."

"ఎందుకు చెప్పవేం?"

"తియ్ చెబుతాను".

తలుపు దగ్గరికి జరిగాను. కనుమరుగైపోయేలోపల వాడి ముఖాన్నొకసారి స్పష్టంగా చూడాలని నా ఆదుర్దా. చూచి నేను చేయగలిగిందేమీలేదు. అయినా వాణ్ణి చూడడానికి

ప్రయత్నించాను. గ్రుడ్డి వెలుగులో వాడి ముఖం నాకు ఒక్క క్షణం మాత్రం కనిపించింది. ఆ వ్యవధిలోనే నేను వాణ్ణి పోల్చుకున్నాను.

వాడు ద్వారబంధాన్ని సమీపించాడు. తలుపు మెల్లగా తెరుచుకుంది. వాడు నీడలా లోపలికి జారిపోయాడు. తలుపుకు గడియపడింది. ఎంత జాగ్రత్తగా వేసినా కీచుమనడం ఆ గడియ అలవాటు.

ఆ అర్ధరాత్రివేళ నా హృదయంలో ఎలాంటి తుఫాను ఘూర్ణిల్లిందో నేను చెప్పలేను. నా కళ్ళకు ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్టు తోచింది. నేనింతవరకూ స్వర్గంలో ఉన్నట్టు భ్రమించాను. కాదు. ఇది నరకం. స్వర్గమన్న అపోహతో నేను నరకలోకంలో పరిభ్రమిస్తున్నాను. అబ్బ! ఏం బాధ యిది! సలసల కాగుతున్న తైలంలో పడదోసి నన్నెందుకు మాడ్చి వేస్తున్నారు? సూదులు తాపడం చేసిన యంత్రఫలకాల మధ్య నిలబెట్టి నన్నెందుకు చిత్రహింసకు గురిచేస్తున్నారు? నేనేం తప్పు చేశానని?

తప్పుచేసింది నేను కాదు! జానకి. ఆమె తప్పు చేస్తోందని నేనెందుకు బాధపడాలి? ఆమె ఎవతె? నేనెవణ్ణి? నేను త్రాచుపాముని పుష్పహారమనుకున్నాను. నిజం ఈ నాటికి తేలింది. ఫణంలా పైకి లేచిన యౌవన దురహంకారంతో కళ్ళు కానకుండా ప్రవర్తిస్తున్నావా జానకీ! ప్రవర్తించు, నువ్వేమైపోయినా నాకు చింత లేదు!

దీపం పెద్దది జేశాను. కూజాను పైకెత్తి ఒక చుక్క నీళ్ళనైనా మిగల్చకుండా గుటగుట త్రాగేశాను. నిద్ర వచ్చే అవకాశం దాటిపోయింది. ఈ రాత్రికి జాగరణే! చేతికి తగిలిన పుస్తకాన్ని పైకి తీశాను.

కాని మనసు పుస్తకంలో లీనం కావడం లేదు. అది కళ్ళెం లేని గుర్రంలా ఎంత ప్రయత్నించినా పది పదిహేను రోజుల క్రితం జరిగిన సంభవంపైకే ప్రసరిస్తోంది.

ఆ రోజు ఆదివారం. రాత్రి పదిగంటల వేళ. నాటకం నుంచి ఒక మిత్రుడితోబాటు ఇంటికొస్తున్నాను.

బజారు నట్టనడుమ ఒక పెద్దగుంపు పోగై ఉంది.

"ఏం జరిగింది?" మిత్రుణ్ణి ప్రశ్నించాను.

అతడు జనంలో దూరి అసలు దృశ్యాన్ని చూచి వచ్చి "త్రాగుబోతు, త్రాగి మత్తులో ఒళ్ళు తెలియక క్రింద పడిపోయాడు" అన్నాడు.

"ఎవడు వాడు?"

"చూచిరా, వాడి కథ చెబుతాను".

మనుషుల్ని ఒత్తిగించుకుంటూ ముందుకు వెళ్ళాను. నిజంగా అది చూడవలసిన దృశ్యం! క్రింద పడివున్నవాడు ముసలీ ముతకాకాదు. వాడి వయస్సు పాతికేళ్ళకు లోబడి ఉంటుంది. మంచి స్ఫురద్రూపి. తెల్లటి గ్లాస్గోమల్లు పంచమీద సిల్కు జుబ్బా తొడుక్కున్నాడు. దొరలు కాల్చుకునే సిగరెట్టు తాలూకు టిన్ను ఒకటి అతడి జేబులో నుంచి క్రిందపడి మూత ఊడిపోగా సిగరెట్లు వీధిలో చెల్లాచెదురుగా పడిఉన్నాయి.. నలుగురైదుగురు ఆ సిగరెట్లనే ముట్టించుకుని జీవం ఉందో లేదో తెలుసుకోడానికి కాబోలు వంగి ఆ పడిపోయి ఉన్న వాడి ముఖం మీదికే పొగ వదులుతున్నారు!

గుండెలు బరువెక్కగా గుంపులోనుంచి బయటికి వచ్చి స్నేహితుణ్ణి కలుసుకుంటూ "వాడి కథ చెబుతా నన్నావే" అని జ్ఞాపకం చేశాను.

"వాడి దీ వూరే. నేనూ, వాడూ ఒక సంవత్సరం పాటు ఒకే డస్కులో కూచుని చదువుకున్నాం. ఆ తరువాత నేను పై తరగతికి వెళ్ళిపోయాను. వాడా తరగతిలోనే, ఆ డస్కులోనే ఉండిపోయాడు. అంతెందుకు? వాడి చదువు ఆ తరగతిలోనే పూర్తయి పోయిందని చెబితే ఒక్కమాటతో సరిపోతుంది".

"బాగా డబ్బున్న వాడేమిటి?"

"డబ్బా ఉంది. డబ్బుతోపాటు అబ్బిన దుర్వ్యసనాలూ ఉన్నాయి. తండ్రి లేడు. తల్లి ఉంది. ఆమెగారికి వీడంటే చెప్పరానంత ముద్దు! వీడు తాగి తందనాలాడినా, ప్రొద్దుమాటు మణక్కముందే సందుల్లో షికారు తిరిగినా ఆవిడకు తప్పుగా తోచదు. డబ్బుంది గనుక ఆ డబ్బుతో సాధ్యమైన ఆనందాలను వీడనుభవిస్తుంటే చూడలేక లోకం కళ్ళల్లో నిప్పులు పోసుకుంటుందని ఆమె అనుకుంటుంది".

"అయ్యో! గ్రహచారమా!" అంటూ విస్తుపోయాను.

"దురాచారాన్నీ, వ్యభిచారాన్నీ గ్రహచారమని నువ్వు సరిపెట్టుకో జూస్తే, నాకేం చింతలేదు. కానీ వీటివల్ల చిట్టచివరకు మిగిలేది మాత్రం విచారం. లేకపోతే వినాశం" అన్నాడు మిత్రుడు ఒక సత్యాన్ని సిద్ధాంతీకరించినట్టు.

"ఇంతకూ వీడి పేరు చెప్పావు కావే" అన్నాను.

"లక్షణమైన పేరు వాసుదేవమూర్తి. సంగ్రహంగా వాసు అని వ్యవహరింప బడుతాడు".

తల దిమ్మ తిరిగింది. వీడేనా వాసు! వీడేనా జానకి మేనత్త కొడుకు.... అప్పటికింతే అనుకున్నాను. కాని ఇంతలోనే ఈ రాత్రివేళ ఒంటరిగా గదిలో కూచుని, జానకి తలుపు తీయగా ఇంట్లో ప్రవేశించింది వీడేనా అని వితర్కించుకుంటున్నాను. కళ్ళతో ప్రత్యక్షంగా చూచిన తర్వాత కూడా సందేహమేమిటి? వాడే వీడు!

ఎప్పుడు తలగడపైకి వాలిపోయానో తెలియదు. అది నిద్ర అని చెప్పడానికి వీల్లేదు. మనసూ, బుద్ధీ, మెదడూ అన్నీ శ్రమించి ఇక శక్తిలేక శోషిల్లి పోయినప్పుడు కలిగే ఒక విచిత్రావస్థ. కళ్ళు తెరిచేసరికి సూర్యకిరణాలు కిటికీ గుండా చాపపైన పడుతున్నాయి. దీపం పెద్దదిగా వెలుగుతూనే ఉంది.

తలుపు తెరుచుకుని పెరట్లోకి వెళ్ళాను. జానకి బావిదగ్గర అంట్లు తోముకుంటోంది. ఆమె ముఖంలో చింతాకంత విచారమైన వ్యక్తం కావడంలేదు.

"అదేమిటన్నయ్యా! రెండు నెలలు పడకబడిన వాడిలా తయారై ఉన్నావు?" పరామర్శించింది జానకి.

"రాత్రి నాకు పిచ్చిబట్టింది" అన్నాను.

"దెయ్యం పట్టలేదు కదా?"

"ఆ పట్టే దయ్యమేదో నిన్నే పట్టింది" అందామనుకున్నాను. అనబోయాను. కాని అనలేదు.

ఆ రోజు హోటల్లో భోంచేస్తూ "నా కొక గది చూచిపెడ్తావా రంగమ్మత్తా" అని అడిగాను.

"ఏం ఇప్పుడున్నదాని కేమొచ్చింది?" అంది రంగమ్మ.

"ఏమో, నాకు సరిపడ్డంలేదు".

"ఆ అమ్మాకూతుళ్ళు నిన్ను సొంత మనిషికి మల్లే చూచుకుంటుంటే సరిపడలేదంటావేమిటి? అయినా ఎండాకాలం సెలవులు రానీవుండు. ఎక్కడైనా గది ఖాళీ అయితే చెబుతాను".

పెరట్లోకి వెళ్ళి చెయ్యికడుక్కుంటూ ఉండగా రంగమ్మత్త దగ్గరగా వచ్చి "ఏం చంద్రయ్యా! ఉన్నట్టుండి గది మార్చేయాలంటున్నావు. ఏం జరిగిందేమిటి?" అని ప్రశ్నించింది.

ఆవులిస్తే ప్రేవులు లెక్కబెట్టే వాలకం రంగమ్మది! అనుమానమంటూ ఒకటి కలగాలేగాని దాని కలరూపు తెలుసుకోడానికి ఆవిడకు వెయ్యి ఉపాయాలు చేతనౌను. ఆమె నాలుగు గోడల మధ్య ఉంటూనే తీగను కదిలిస్తుంది. అంతటితో పట్టణం, పట్టణమంతా డొంకలా కదలిపోతుంది.

"అబ్బే, విశేషమేమీలేదు. ఆ గది కాలేజికి కొంచెం దూరంగా ఉందంతే" అన్నాను.

వేసవి సెలవులు మార్చి మూడోవారంలో ప్రారంభమౌతాయి. ఈ ఏడెనిమిది వారాలూ వీలైనంతవరకూ గదివైపు వెళ్ళకుండా కాలహరణం చేయదలచుకున్నాను. కంబైండ్ స్టడీ అని పేరుబెట్టి మేం నాలుగైదుమంది సహపాఠకులం కాలేజీలోనే ఓ గదిలో చదువుకోసాగాము. అప్పుడప్పుడూ పుస్తకాలకనీ, బట్టలకనీ గదిదగ్గరికి వెళ్ళవలసి వచ్చేది. వెళ్ళినప్పుడల్లా ముక్తసరిగా ముసలావిడతో మూడు మాటలు మాట్లాడి బయటికి వచ్చేయాలని అనుకునేవాణ్ణి. కాని జానకి విడిచిపెట్టేది కాదు. "వేళకు స్నానం చేయడంలేదు, ఇంటికి రావడంలేదు, చదివి చదివి కళ్ళు లోపలికి పోయాయి. ముఖం పీక్కుపోయింది. మనిషిని క్రుంగదీసే చదువు చదివేం, చదువకేం" అంటూ సాధించేది.

ఈ జానకిని గురించి నే నేమనుకోను? తను చేస్తున్నది తీవ్రమైన తప్పిదమని ఈమెకు తెలియదా? లేక తెలిసే చేస్తోందా? దీనివల్ల ఎలాంటి విషమపరిణామాలు ఏర్పడ్డానికి అవకాశముందో ఈమె బుద్ధికి తట్టడంలేదా? ఏమో, జానకిదంతా అయోమయం! నాపాలిటి కామె ఒక చిక్కువీడని సమస్య.

పక్క కొరికేలోపుగా గ్రుంకిపోయే ప్రొద్దుతోనూ ఎంతకూ అంతంగాని రాత్రులతోనూ ఇరవై ఎనిమిది రోజుల ఫిబ్రవరి నెల శరవేగంతో గడిచిపోయింది. పరీక్షవ్రాసి, పెట్టే బేడా సర్దుకుని వీడ్కోలు తీసుకోడానికి ఇంటి లోపలికి వెళ్ళాను. మంచాన్ని అంటిపెట్టుకపోయిన ముసలావిడ ముఖంలో క్రమేపీ జీవకళ నీరసించి పోతోంది. జానకి ముఖంలో సైతం ఎన్నడూలేంది ఒక విచారరేఖ నా కారోజున స్పష్టంగా పొడగట్టింది. అది నేను వెళ్ళిపోతున్నందుకు కలిగిన విచారమా? లేక స్వయంకృతాపరాధాన్ని హఠాత్తుగా గుర్తించినందువల్ల కలిగిన పశ్చాత్తాపం గుండెల్లోనుంచి పొంగి ఆమె ముఖాన్ని వివర్ణం చేసి వేస్తోందా?

"వెళ్ళొస్తాను జానకీ! అన్నాను.

వంట చేసుకుంటున్న జానకి నాకేసి తిరిగింది. ఆమె కళ్ళల్లోనుంచి కన్నీరు ధారలుగట్టి ప్రవహిస్తోంది.

"ఎందుకేడుస్తావు జానకీ?" అది ఊరడింపు కాదు. ఊరికే నిర్లిప్తంగా ప్రశ్నించాను.

"అమ్మ స్థితి ఇలా దిగజారిపోతోంది. నాకు అన్నతమ్ముళ్ళు లేరు. అక్కచెల్లెళ్ళు లేరు".

"అవును. నిజమే" అన్నాను.

"ఈ దిక్కులేనిదాన్ని మరచిపోతావా అన్నయ్యా!"

ఒక్కసారిగా నేను హృదయానికి బిగించుకున్న ముళ్ళన్నీ పుటుక్కున తెగిపోయాయి. కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. ముఖాన్ని మరోవైపుకు తిప్పుకుంటూ "ఎలా మరచిపోగలను జానకీ! నువ్వింతటి మంచిదానివి కాకపోతే మరిచిపోయేవాడినేమో! మనుషులకింత మంచినతం పనికిరాదు. మనుషుల్లో పశువులున్నారు. వాళ్ళు తేనెపూసిన కత్తుల్తో తడి గొంతుకలు కోస్తారు. అయినా నీకేం భయంలేదు. భగవంతుడు నిన్ను రక్షిస్తాడు" అన్నాను.

బహుశా నా మాటలు అర్థమై ఉండవు. జానకి నివ్వెరపోతోంది.

"అవును జానకీ? ఇవి నేను చెప్పిన మాటలు కావు. ఎవరో నా చేత పలికించారు" అంటూ పెట్టె తీసుకుని బయటికి వచ్చాను.

జానకి గది గుమ్మంవైపు చూస్తూ "మళ్ళీ వస్తావుగదూ అన్నయ్యా! ఈసారి నువ్వు "వచ్చేంతవరకూ ఈ తలుపు ఇలాగే ఉంటుంది. నువ్వే వచ్చి తీసుకోవాలి" అంది.

"అలాగే జానకీ! జాబులు వ్రాస్తుంటావు కదూ?" అప్రయత్నంగానే అడిగాను.

జానకి కంబానికి ఆనుకుని వ్రాస్తా నన్నట్టు తలాడించింది. నేను తలవంచుకుని వీధి వెంబడి నడవ సాగాను...

✧ ✧ ✧

"ఏమండీ! ఏమండీ! తలుపుపైన చప్పుడుతోబాటూ పిలుపు వినిపించింది.

"ఎవరూ? ఏమిటీ? ఎందుకూ?" అంటూ పైకిలేచాడు సూర్యం.

"అయ్యోరామ! అదేం కంగారు బాబూ! అదేపనిగా టెలిఫోన్ మ్రోగుతుంటే పిలుద్దామని వచ్చాను" అంది నీరజ.

తలుపు తెరుస్తూ సూర్యం "ఎవరో అడగలేక పోయావా?" అన్నాడు.

"అడక్కేం, 'మాట్లాడుతున్నది డాక్టర్ చెట్టూర్. అవసరం, అత్యవసరం' అని గోలబెడుతున్నాడు".

సూర్యం ఒకసారికి మూడేసి నాలుగేసి మెట్లుగా క్రిందికి లంఘించి రిసీవరు చేతికి తీసుకున్నాడు.

"హలో డాక్టర్! నేను సూర్యనారాయణని, ఏం జరిగింది?"

"ఉదయం మీరు పంపించారే ఆ ముసలాడు...."

"ఏమయ్యాడు?"

"అతడి స్థితి చాలా అపాయకరంగా ఉంది".

"ఉంటుంది. ఎందుకుండదు? వాడు సంఘానికి చీడపురుగ్గా బ్రతికాడు. మానవతుల శీలానికి ముప్పుగా బ్రతికాడు. ఈ మాట నేను చెప్పడం లేదు. మా నాన్నగారు చెబుతున్నారు. పాపాలు ఊరికే వదుల్తాయా! డాక్టర్? పాములు కప్పల్ని తరుముతాయి. పాపాలు మనుషుల్ని వెంటాడుతాయ్ వెంటాడనీ, అందుకెవరేం చేయగలరు? మీరు... మీరు..."

చేతిని సూర్యం నోటి కడ్డంగా చాచి "ఏమిటండీ మీ గగ్గోలు" అంటూ వారించింది నీరజ.

సూర్యం కాస్త తమాయించుకుని నీరజ చేతిని ఆవలికి తోసివేస్తూ "మీ చేతనయింది మీరు చేయండి డాక్టర్. అంతకంటే నేనేం చెప్పగలను" అన్నాడు.

"ఆల్‌రైట్! ప్రయత్నిస్తాను" అంది అవతలి కంఠం. సూర్యం రిశీవరును యథాస్థానంలో ఉంచి మేడమెట్లకేసి తిరిగాడు.

"కాసేపుండండి. కాఫీ తీసుకెళ్దురుగానీ" అంటూ నీరజ వంటగదికేసి వెళ్ళింది.

చేతివేళ్ళను క్రాపింగులో దూర్చి కణతల్ని గట్టిగా అదిమిపట్టుకుంటూ కళ్ళు మూసుకుని సూర్యం కుర్చీలో కూచున్నాడు. నీరజ ఎప్పుడు వచ్చిందో సూర్యానికి తెలియదు. పెదవులకు వేడి కప్పు తగిలి చురుక్కు మనగానే ఉలిక్కిపడి అతడు కళ్ళు తెరిచాడు. "త్రాగండి కాఫీ" అంది నీరజ.

సూర్యం కప్పును చేతిలోకి తీసుకొని ముఖం పైకెత్తి ఓ గ్రుక్కెడు కాఫీ నోట్లో పోసుకున్నాడు.

"అదేమిటండీ. కాఫీని మంచినీళ్ళలా తాగేస్తున్నారు?" విస్తుపోయింది నీరజ.

కప్పును టేబిల్‌పైకి జారవిడిచి సూర్యం అలాగే పైకి లేచాడు. కుడ్యానికి అలంకార ప్రాయంగా అమరివున్న పెద్ద సైజు ఛాయాచిత్రాన్ని చూస్తూ ముందుకు నడవసాగాడు. "సౌభాగ్యవతి జానకి".

పటం క్రింద ఎవరు వ్రాశారో గాని, ఆ అక్షరాలు ముత్యాల్లా మెరిసిపోతున్నాయి.

"మీ వాలకం చూడనూ చూడనూ నాకు మతిపోతోందండీ బాబూ! అది మీ అమ్మగారి ఫోటో. ఈ రోజు కొత్తగా అందులో ఏం కనబడిందేమిటి?" అంది విస్మయంతో నీరజ.

సూర్యం దిక్కులు తోచనివాడిలా నీరజ మాటలు విన్నాడు. మళ్ళీ ఛాయా చిత్రాన్ని చూచాడు. మేడ మెట్ల దగ్గరికి దూకాడు. మరుక్షణాన మేడపైన గదిలో ఉన్నాడు.

✧ ✧ ✧

"పట్నాల్లోనైతే కాలం విద్యుల్లతలా పరుగులు తీస్తుంది. పల్లెటూళ్ళలో అంచనడకలు నడుస్తుంది. ఊళ్ళో మూడు నెలల సెలవులు మూడు యుగాల్లా గోచరించాయి. పదిగంటలకల్లా స్నానం చేసి సుష్టుగా అన్నం తిని నిగనిగలాడే నీరెండలో టెంకాయతోపు దగ్గరికి నడుస్తుంటే ఎప్పుడెప్పుడు మంచంపైన వాలిపోదామా అనిపించేది. చల్లటి నీడలో పడుకుని పుస్తకం తెరిస్తే మనసు ఎక్కడెక్కడికో పుచ్చులు తెంచుకుని ఎగిరిపోయేది. ఎందుకో అర్థంకాని కాలేజీ చదువులు, ఉన్నా ఊడినా హృదయాన్ని కదిలించలేని విద్యార్థుల సాహచర్యాలు, రుచిగానే ఉన్నా నాలుగు పూటలు వరుసగా తినేసరికి ముఖం మొత్తే రంగమ్మ భోజనం, ఈ తలపుల చిట్టచివర జానకి! వల్లమాలిన ఆత్మవిశ్వాసం, అతికిమించిన అమాయకత్వం లాంటి నిరుపయోగకరమైన ఆయుధసామగ్రితో జీవిత రణరంగంలో నిస్సంశయంగా ప్రవేశిస్తున్న నిస్సహాయ జానకి! ఏమైవుంటుందో జానకి!

ఏమో! నాకు తెలియదు. మూడు నెలలుగా ప్రతిరోజూ తపాలావాడికోసం ప్రతీక్షించాను. వచ్చాడు వెళ్ళిపోయాడు. జానకి దగ్గరనుంచి మాత్రం ఉత్తరం లేదు.

నా చదువుకోసం నాన్నగారప్పటికే ఐదారువందలు అప్పుచేసి పెట్టారు. ఇంకా మూడేళ్ళు చదువుకోందే నా చదువుకు రాణింపులేదు. అత్తగారింటినుంచి వచ్చే ఆడబిడ్డలకు సారెసారెకూ సారెలు పెట్టి పంపాలి. అప్పు చేయడానికి మాత్రం ఇంకా బోలెడన్ని అవసరాలున్నాయి. కాని ఒక్క బాండులోనైనా పదిరూపాయలు చెల్లువేయగల అవకాశం కనుచూపు మేరలో కనిపించడంలేదు. సమయానికి మా నాన్నగారికొక మార్గాంతరం స్ఫురించింది. ఆయన నన్ను పెళ్ళిళ్ళ మార్కెట్టులో పెట్టారు. తెలివి, చదువు, అందం

మొదలైన నా యోగ్యతల్ని గురించి పరిచితుల ద్వారా, బంధువుల ద్వారా ప్రచారం చేశారు. ఏతత్ఫలితంగా నాకో సంబంధం వచ్చింది. అమ్మాయి ఇంకా చిన్నపిల్ల. నా చదువుకిక వాళ్ళే పెట్టుబడి పెడ్తారు. పెళ్ళి ఒక సంవత్సరం తరువాత జరిగినా ఫరవాలేదు. ఈ షరతులతో కాబోయే నా వివాహానికి ఇటు మా నాన్నగారికీ, అటు అమ్మాయి తండ్రికీ ఒప్పందాలు కుదిరాయి.

రేపు కాలేజి తెరవబోతున్నా రనగా ఈ రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకు అనంతపురంలో దిగాను. రంగమ్మ హోటలు స్టేషనుకు చేరువలోనే ఉంది. రైల్లో కూచుని నరాలు పట్టుకపోయిన కాళ్ళ నీడ్చుకుంటూ రోడ్డువెంబడి నడుస్తున్నాను. జరుగుతున్నది ఎండాకాలం కాకపోయినా ఎండ నిప్పులు చెరిగిపోస్తోంది. గడచిపోయిన వేసవిలో సైతం ఇలాంటి మండుటెండలు లేవు. పైగా మే నెల పొడుగునా ముసురుబట్టి జడివానలు కురిశాయి. చైత్రవైశాఖాలు వసంత మనుకుంటాము. కొన్ని చెట్లు చైత్రం కాకముందే చిగురిస్తాయి. కాలమనే పట్టకంలో ఋతుధర్మాలే వక్రీభవనం చెందుతున్నాయి. ఇక మానవస్వభావాల మాటేమిటి?

"బాగున్నావా నాయనా!" అంది రంగమ్మత్త నేను కనపడగానే.

"ఏదో, ఇలా ఉన్నాను" అంటూ నేలపైన చతికిల పడ్డాను.

రంగమ్మ ఇచ్చిన స్వాగతం నాకు రుచించింది కాదు. మరికొంత అప్యాయంగా ఆమె నన్ను పలకరించి ఉండవలసింది. ఒకటి రెండు నెలల తర్వాత మనిషి కనబడితే రంగమ్మ అతనికి స్వాగత మిచ్చేతీరేవేరు. గబగబా అతని దగ్గరకు వచ్చి కనుగుడ్లు పెద్దవి కాగా నిలువునా పరిశీలిస్తూ "ఇదేమిటయ్యోవ్! బాగా చిక్కిపోయావే?" అనో, "ఉర్లగడ్డలా ఊరిపోతున్నావే అల్లుడా! పెళ్ళి తలపెట్టుకోకూడదూ?" అనో నవ్వుతూ పరామర్శించడం రంగమ్మ అలవాటు. నాకలాంటి మర్యాద జరగలేదు. జరక్కపోయినందుకు కాదు నా చింత. రంగమ్మ కెందుకో నా పైన కినుక కలిగింది. కారణమేమిటి? అదే నా ఆలోచన.

హాల్లో భోంచేస్తున్నవాళ్ళు ఒక్కొక్కరుగా లేచిపోయారు. రెండోబంతికి నేనొక్కణ్ణి మాత్రం మిగిలాను. హోటల్లో కొత్తగా చేరిన అబ్బాయి ఒకడు వడ్డిస్తున్నాడు. రాత్రి భోజనానికి వంకాయలు తరుక్కోడం కోసం కత్తిపీట పైన కూర్చుంటూ రంగమ్మ ఒకసారి నన్ను తీక్షణంగా చూచి "మట్టిగుర్రాన్ని నమ్మి గోదావరిలో దిగకూడదు" అంది.

సుమారుపాటి పడుగొకటి తలపైన పడినట్టయింది నా పని. అన్నం తింటున్న విషయం కూడా మరచిపోయి తెల్లబోతూ రంగమ్మ కేసి చూడసాగాను.

"ఒక సంవత్సరం పాటు ఆ ఇంట్లో ఉన్నావు. వాళ్ళు నిన్నక్కడే తినమన్నారు కూడా! నువు వాళ్ళకి అంతగా కావలసినవాడి వయ్యావు. ఈ ప్రపంచకంలో వాళ్ళకు మగదిక్కంటూ ఉంటే నువ్వొక్కడివే! అయితే నువు చేసిన పనేమిటి?"

"ఏం చేశాను?" నిజానికి నేనేమీ తప్పు చేయలేదు. కాని నేనెందుకో భయంతో వణికిపోతున్నాను. బహుశా ఆ క్షణాన నా ముఖం పాలిపోయి ఉంటుంది.

"ఇంకేం చేయాలి? ఆ ముసలావిడ ప్రాణం గుటుక్కుమన్నప్పుడు నువు రావలసింది! పాపం, ఆ పిల్ల ఏం చేస్తుంది? పైగా వట్టి మనిషి కూడా కాకపోయె!"

"ఏమిటీ?"

నా అకతాయితనాన్ని అవహేళన చేస్తున్నట్టుగా ఓసారి తేలిగ్గా నవ్వి "ఏమిటో నీకే తెలియాలి బాబూ! మాకేం తెలుస్తుంది?" అంది రంగమ్మ.

"నాకేం తెలియదు" అన్నాను. అనడమేమిటి, వీధిలోకి వినిపించేటట్టు అరిచాను. అది స్వగృహం కాదు. అయివుంటే ఆ రోషంలో నేను అన్నాన్ని నలుమూలలకు వెదజల్లేవాణ్ణి. నా కంతకోపం తెప్పించినవాళ్ళపైకి టంబ్లర్ గిరవాటు వేసివేందేవాణ్ణి.

"నీకేం తెలియదూ? నువ్వే పాపమూ ఎరుగవూ?" నిలదీసి ప్రశ్నిస్తోంది రంగమ్మ.

"అవును నాకే పాపమూ తెలియదు. కావలిస్తే తినబోతున్న అన్నాన్ని చేతబట్టుకుని ప్రమాణం చేస్తాను" అన్నాను.

రంగమ్మ విచిత్రమైన మనిషి. ఒక క్షణంలో ఆవిడకోపం నాపైన అసహ్యంగా మారిపోయింది. 'తప్పు చేయకపోతే నీకెందుకు కోపం వస్తుంది? దోషం నీలో లేకపోతే నానోట మాట వచ్చీ రాకముందే నువ్వెందుకు ప్రమాణాలకు దిగుతావు?"

ఇదేం కుతర్కం! రంగమ్మకు నేనేం సంజాయిషీ చెప్పుకోగలను? ఎలా చెబితే ఈమెకు నమ్మకం కలుగుతుంది? లోకులు కాకులు. ఆ కాకులకు ప్రాతినిధ్యం వహిస్తున్న మనిషి రంగమ్మ. రంగమ్మ 'కాః కాః' అంటోంది. ఇక కాకులన్నీ అరుస్తాయి. నా చెవులు చిల్లులు పడిపోతాయి. నేను వినలేను. నేను భరించలేను. వినలేక ఆ బాధను భరించలేక నే నేం చేయగలను?

విస్తరిలో అన్నాన్ని అలాగే వదిలిపెట్టి పైకిలేస్తూ "నువ్వేమో మంచిదానవను కున్నాను. నువ్వు గొడ్రాలివి. నీకు కొడుకులుంటే వాళ్ళపైన ఎవరైనా ఇలాంటి నీలాపనిందలు వేసి వుంటే, అప్పుడు నా బాధ నీకర్థమై ఉండేది" అంటూ తొట్లో చేయి కడుక్కున్నాను.

"ఇంతమాత్రం నా కొడుకైతేనా? ఇటూ అటూ నాలుగు లెంపకాయలు వాయించి రెండు నెలల క్రితమే ఆ పిల్లను వాడికి ముడిపెట్టి ఉండేదాన్ని".

వీధిమెట్లు దిగుతూ ఆ మాటలు విని ఆగాను. ఇక రంగమ్మతో వాదించి లాభంలేదు. తల వంచుకుని మెల్లగా వీధిలోకి వచ్చేశాను.

నడుస్తున్నాను కాని గమ్యస్థానమేదీ? మనసిచ్చి నా మాటల్ని అర్థం చేసుకోగలిగిన వాళ్ళెవరున్నారు? ఒక్క జానకి తప్ప! అపరాధం చేయనూ చేసి, అపవాదు నాపైన పడుతుంటే ఉలక్కుండా పలక్కుండా పరిణామాలకోసం ఎదురుచూస్తున్న జానకి! ఈ జానకిని ఏం చేసినా పాపంలేదు. పెళ్ళీ పెటాకులూ కావలసినవాణ్ణి. నలుగురిలో తల ఎత్తుకుని తిరగవలసిన వాణ్ణి. తనని తోబుట్టువుగా తప్ప మరొక దృష్టితో చూచిన పాపాన పోనివాణ్ణి, నన్నిలా నగుబాట్ల పాలుచేసి నాలుగు గోడలమధ్య కూచుంటుందా జానకి? సత్యాన్ని వెలిబుచ్చవలసిన అవసరం కలిగినప్పుడు దాన్ని ప్రకటించకుండా మౌనంగా ఉండడం కన్నా ఘోరమైన అపరాధం లేదని జానక్కి తెలియదు కాబోలు. అడుగుతాను. నిలదీసి అడుగుతాను. నేనసమర్థుణ్ణి గాను, సత్యమేదో కక్కించి ఈ లోకుల నోళ్ళు మూయడం నా చేతనౌను.

ఈ నిర్ణయానికి వచ్చినప్పుడు పట్టణంలో ఏ భాగంలో ఉన్నానో నాకు తెలియదు. తరువాత అయిదు నిమిషాలకు "జానకీ, జానకీ" అని పిలుస్తూ తలుపు దబదబా బాదేస్తున్నాను.

ఇరుగుపొరుగు వాళ్ళు కొందరు అప్పుడే నా రాకను పసిగట్టేశారు. నా తెంపరితనానికి విస్తుపోతూ నోళ్ళు నొక్కేసుకుంటున్నారు. కళ్ళతోనే నన్ను గురించి మాట్లాడుకుంటున్నారు.

తలుపు మెల్లగా తెరుచుకుంది. లోపల ప్రవేశించాను. కళ్ళు పైకెత్తి జానకిని చూడ్డానికి మనసొప్పుకోడంలేదు. పెడముఖంతోనే నడవలోకి వెళ్ళి మంచంపైన కూర్చున్నాను.

"ఊరినుంచి ఎప్పుడొచ్చావన్నయ్యా?"

అప్రయత్నంగా తల పైకెత్తి జానకివైపు చూచాను. ముఖంలో కాంతిలేదు. విరిసీ విరియని వేయి రేకుల పద్మానికి కాడదగ్గర కాటుపడింది. ఆ కాటు లోకానికి కనపడ్డం లేదు. కాని పువ్వు వాడిపోతుండడం మాత్రం లోకం రూక్షవీక్షణాలతో చూస్తోంది. కడ కది వాడి వత్తై శుష్కించి నశించిపోవడాన్ని కూడా లోకం నిర్లిప్తంగా చూడగలుగుతుంది.

కూలిపోయిన రాజప్రాసాదంలో ఏపుగా పెరుగుతున్న బొంత జెముడు పొదలా జానకి హృదయంలో ఆవేదనలు చెలరేగుతున్నాయని ఎవరికి తెలుసు? వానలు లేక బీటలు వారిపోయిన మాగాణీ పొలంలా ఆమె మనసు వికలమైపోతోందని ఎవరికి తెలుసు? లేదంటే ఆమె అడుసులో కాలువేసిందని అందరూ తెలుసుకున్నారు. ఆమె పతితురాలై పోయిందని చెవులు కొరుక్కున్నారు.

"మధ్యాహ్నం బండికొచ్చాను. నేరుగా హోటలుకు వెళ్ళి భోంచేసి వస్తున్నాను"

"అన్నం తిన్నట్టు కనపడ్డం లేదే?"

"తినాలనే కూచున్నాను. కానీ తీరా మారా తినలేక పోయాను"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? మీ అమ్మ చనిపోతే ఓ కార్డు ముక్క వ్రాయడానికైనా ఓపిక లేకపోయిందా జానకీ నీకు? అవసరం లేనప్పుడు వారానొకో ఉత్తరం వ్రాసేదానివి. ఏమిటో మరి! ఆడవాళ్ళ మనస్తత్వాలెవరికి అర్థమౌతాయి?"

"నేను మునుపటిలా ఉన్నానా అన్నయ్యా! లేదు. చెడిపోయాను. ఇప్పుడు నేనేం చేసినా లోకానికి తప్పుగానే కనిపిస్తుంది. అందుకనే జాబు వ్రాయలేదు"

జానకి ఇంత స్పష్టంగా తప్పొప్పులు తేల్చి మాట్లాడి వేస్తుందని నేననుకోలేదు? ఆమె అపరాధం చేయడంలో ఎంత ధైర్యం ప్రదర్శించిందో దాన్ని ప్రకటించడంలోనూ అంతే ధైర్యం ప్రదర్శిస్తోంది.

బయట వడగాడ్పు ఇంకా తగ్గలేదు. అయినా ఇంట్లో చల్లగా ఉంది. ఎండలో కాగికాగి బరువెక్కిన తల నాకు తెలియకుండానే మంచంకోడుపైకి ఒదిగిపోయింది. కళ్ళు మూసుకుని ఆలోచనలో పడ్డాను; నేను జానకిని తీవ్రంగా మందలించాలను కున్నాను. ఏదీ? ఎప్పుడు మందలించాను? లేదంటే ఆమె జాబు వ్రాయకపోవడం ఒక నేరంగా ఎత్తి చూపించగలిగాను. ఆమె జాబు వ్రాసివుండి సెలవుల్లో నేనొకసారి ఇక్కడికి వచ్చివుంటే ఆ సంఘటనవల్ల లోకుల అనుమానం మరింత బలపడి ఉండేది. ఒక జానకితో నాకు అవినీతికరమైన సంబంధముందని లోకులనుకుంటున్నారంటే అందుకు బాధ్యత జానకిది మాత్రమే కాదు. నే నీ ఇంట్లో ఏడెనిమిది నెలలు అద్దెకున్నాను. కాని నే నద్దెకున్నానని ఎవరనుకున్నారు? నా ప్రవర్తన హద్దులు మీరింది. అప్పట్లో జానికినీ, నన్నూ చూచిన వాళ్ళు ఎంతవరకైనా ఊహించుకోదానికి అవకాశముంది. వాళ్ళ కలాంటి అవకాశం ఇవ్వడంలో జానకి దెంత తప్పో, నాదీ అంత తప్పే! నిజం ఇలా ఉండగా జానకిని నేనేమని మందలిస్తాను?

జానకి ఇప్పుడు పట్టిమనిషి కాదు. రంగమ్మ చెప్పిఉండకపోయినా ఈ విషయం నాకీపాటికి తెలిసి ఉండేది. ఇప్పుడు జానకి లజ్జాభిమానాలు వదలి, తన నీ స్థితికి తెచ్చినవాడెవడో లోకానికి ప్రకటిస్తే నే నీ పద్మవ్యూహం నుంచి బయటపడగలను. కాని తన అనుమానాలు, ఆధారాలు మరొక విధంగా ఉండగా ఆ సత్యాన్ని లోకం తర్క వితర్కాలు లేకుండా నమ్మేస్తుందని నమ్మకమేమిటి? నేనూ, జానకీ కూడబలుక్కుని ఈ అపనిందను మరొకడి తలపైన రుద్దతున్నామని వాళ్ళనుకుంటే?

"లేచి ముఖం కడుక్కో అన్నయ్యా! నాలుగు మెతుకులు ఎంగిలి చేద్దువుగానీ" అంది జానకి దగ్గరగా వస్తూ.

"నీకు జ్ఞాపకముందా జానకీ! ఆనాడు నేను బల్ల గుద్దినట్టు చెప్పాను" అంటూ లేచి కూచున్నాను. "మానవుల కింత మంచితనం పనికిరాదు. మనుషుల్లో పశువు లుంటారు. వాళ్ళు తేనెపూసిన కత్తుల్తో తడి గొంతుకలు కోస్తారు".

"నిజమే అన్నయ్యా!" అంది జానకి. ఆమె కంఠం గద్గదికమై పోయింది. "మోసపోయాను. తప్పకుండా పెళ్ళి చేసుకుంటానన్నాడు. నేను గనుక ఒప్పుకుంటే దుర్వ్యసనాలన్నీ వదులుకుంటానన్నాడు. ఇలా మోసం చేస్తాడని నాకు తెలియదు".

నేనా క్షణాన ఊరుకోవలసింది. ఒకప్పుడు ఉచితానుచితాలు ఎరగకుండా నోరు జారవిడవడం నాకే కాదు. మానవులందరికీ పరిపాటి. అసలే అగ్నిజ్వాల. అందులో నే నాజ్యం పోశాను.

"ఇలా మోసం జరుగుతుందని నా కాదినుంచీ తెలుసు జానకీ! ఆ రోజు ఉదయం నేను లేచి పెరట్లోకి వచ్చాను. 'అదోలా వున్నావే'మని పలకరించావు. 'రాత్రి నాకు పిచ్చిపట్టిం'దన్నాను. నువ్వు 'దెయ్యం పట్టలేదుగదా' అన్నావు. అప్పుడు అందామనుకున్నాను. ఆ పట్టే దెయ్యమేదో నిన్నే పట్టిందని, కాని అనలేదు".

"మన కెందుకని ఊరుకున్నావు గదూ?" సూటిగా ప్రశ్నించింది జానకి.

"అవును" అన్నాను.

"నిజమే, నీ చెల్లెలై ఉంటే నువ్వా క్షణంలోనే సరిదిద్దుకునేవాడివి. ముక్కెలు విరగదన్ని గదిలో వేసి తాళం వేసేవాడివి. నేనెవతెని? నే నేమైపోయినా నీకేం చింత? ఈ లోకంలో న్యాయమింతే అన్నయ్యా! అదీ ఇప్పుడే తెలిసింది".

నాకు నిజంగానే పిచ్చి పడ్తుందేమో ననిపించింది. ఒక గంట క్రితం నా దృష్టిలో జానకి దోషి. కాని ఇంతలోనే వ్యవహారం తలక్రిందులైంది. నేను ముద్దాయినైపోయాను. జానకి నామీద నేరం ఆరోపిస్తుంది.

"అదంతా ఇప్పుడెందుకన్నయ్యా! నువ్వు భోంచేద్దువుగాని లే!" అంది జానకి.

లేచీ ముఖం కడుక్కుని గదిలోనికి వెళ్ళి పీటపైన కూచున్నాను. అన్నం వడ్డిస్తూ అంది జానకి: "అమ్మకు పదిరోజులు జ్వరం కాసింది. నాలుగు రోజులు ఒంటిమీద స్మారకం లేదు".

"మందిప్పించలేదూ?" అన్నాను.

"డాక్టరొచ్చాడు. రెండు సూదులు వేశాడు. గుణం కనిపించలేదు. పెదవి విరిచి వెళ్ళిపోయాడు. జ్వరం వచ్చిన కొత్తలో అమ్మ 'చంద్రానికైనా జాబు వ్రాయకూడదా జానకీ' అంది".

"ఏమన్నావు?"

"ఎవరొచ్చి మాత్రం చేసే దేముందని ఊరుకున్నాను. ఇక రెండు రోజుల్లో స్మారకం తప్పిపోతుందనగా అమ్మ నన్ను దగ్గరకు రమ్మంది. మంచంపైన కూచోమంది. నా తలను రొమ్ము కానించుకుని 'ఈ లోకంలో ఎలా బ్రతగ్గలవు జానకీ' అని అడిగింది. 'దేవుడున్నాడులే అమ్మా' అన్నాను. రాత్రులు బొత్తిగా నిద్రపట్టేది కాదు. ఏ వేళకంటే ఆ వేళకు లేచి పాలు త్రాగించేదాన్ని. ఓపిక ఉన్నంత వరకూ గ్రుక్కెడు గ్రుక్కెడుగా పాలు మ్రింగింది. ఆ తర్వాత పోసిన పాలు ఇట్టే వచ్చేసేవి. ఈ రోజు రాత్రి తెల్లవారు ఝామున లేచి కుంపట్లో పాలుకాచి మంచం దగ్గరకు తీసుకెళ్ళాను. అమ్మ ఉలకలేదు, పలకలేదు, చనిపోయింది".

జానకి వెక్కి వెక్కి ఏడుస్తోంది. "అమ్మేకాదు జానకీ! మనమందరమూ చనిపోవలసినవాళ్ళమే" అంటూ లేచి చెయ్యి కడుక్కున్నాను! జానకి విస్తరి తీసుకెళ్ళి పెరట్లో పారవేసి లోపలికి వస్తోంది.

"ఒకసారి నేను వాసుతో మాట్లాడి చూస్తాను జానకీ" అన్నాను, నడవలోంచి ఆకాశంవైపు చూస్తూ.

జానకి రెండు క్షణాలు ద్వారం దగ్గర ఆగింది. తర్వాత మౌనంగా వంటగదిలోకి వెళ్ళిపోయింది. ఆ పరిస్థితిలో మౌనంగా గాక మరొకవిధంగా జానకి ఎలా అంగీకారాన్ని వెలిబుచ్చగలుగుతుంది?

తలుపు తీసుకుని చరచరా వీధిలోకి వచ్చేశాను. వాసుదేవమూర్తి ప్రత్యేక నివాసగృహాన్ని నే నొకటి రెండుసార్లు చూచాను. కాని అతడు ఇంటిపట్టున పడివుండే మనిషికాదు. అదృష్టవశాత్తూ ఆ రోజు సాయంత్రం ఇంటిదగ్గరే కనిపించాడు. చూచి చూచి దాన్ని ఇల్లని పేర్కొనడం బాగుండదు. అది పాశ్చాత్యుల అర్ధరాత్రి క్లబ్బులాంటిది. హాలు నిండా గ్రీకు దేవతల నగ్న శిల్పాలు, గోడకు చవకబారు మంగలిషాపుల్లో ఉండదగిన బూతు చిత్రాలూ ఉన్నాయి. వాసును ఒంటరిగా కలుసుకోవాలనుకున్నాను. ఆ అవకాశం మాత్రం లభించింది కాదు. మిత్రులతో కలిసి అతడు 'మీనాఫ్' ఆడుతున్నాడు. నన్ను చూడగానే జూదగాళ్ళలో ఒకడు "అడ్డానికి వచ్చావా?" అని అడిగాడు. "కాదు, ఆయనతో మాట్లాడ్డానికి వచ్చాను" అంటూ వాసును చూపించాను. నా కేసి విచిత్రంగా చూచి "నాతో మాట్లాడాలా?" అన్నాడు వాసు. అవునన్నాను. "ఇక్కడే మాట్లాడవచ్చు" అన్నాడు. "ఎంతోసేపు పట్టదు. అయిదు నిమిషాలు. ఆ గదిలోకి వెళ్దాం" అన్నాను. వాసు నాలుగాటలు ఆడి, మళ్ళీ పైకిలేచాడు. గదిలో కూచుని చెప్పవలసిన విషయం సంగ్రహంగా చెప్పేశాను. కావ్యానంతరం ఫలశ్రుతిలా ఆడవాళ్ళని నమ్మించి మోసగించడం చాలా సులభమనీ, కుసుకు కొరగానవాడు కూడా అలాంటి పనిని నిర్విఘ్నంగా నెరవేర్చగలడనీ, చేసిన తప్పును సరిదిద్దుకోడం ఇహపరాలకు రెంటికీ మంచిదనీ నచ్చజెప్పబోయాను. "ఆ అమ్మాయి తరపున వకాల్తా పుచ్చుకోడానికి నీకూ, ఆవిడకూ ఉన్న సంబంధమేమిటో తెలుసుకోవచ్చా?" అన్నాడు వాసు. ఐదు నిమిషాలసేపు ధారాపాతంగా అతడు మాట్లాడిన మాటల్లో సభ్యప్రపంచం వినదగిన మాటేదైనా ఉంటే ఇదొక్కటే! మనిషికి సౌశీల్యం అవసరమన్న మూల సిద్ధాంతంలోనే నమ్మకం లేనివాడు అంతకన్నా మెరుగ్గా మాట్లాడ్డం సాధ్యం కాదేమో?

తిరిగి వస్తున్న నాకు గదిలోనుంచి పకపకలు, వికవికలు వీడ్కోలిచ్చాయి. బరువుగా అడుగులు వేసుకుంటూ చీకటి గుయ్యారాల్లా ఉన్న వీధుల్లో నడుస్తున్నాను. ఇంటికి వెళ్ళి

నేను జానకితో ఏం చెప్పాలి? ఆశ చాలా మొండిది. ఎలాంటి విషమ పరిస్థితుల్లోనైనా అది నే నున్నానని పైకి పొడసూపుతుంది. నా వేడికోలును అతడు మన్నిస్తాడనీ, తన బ్రతుకు తోటలో వసంతాలు వెల్లివిరిసే అవకాశం లేకపోలేదనీ ఆశిస్తుంటుంది జానకి! ఈ ఆశాజ్యోతి కూడా ఆరిపోతే ఆమె బ్రతుకేం కావాలి?

ఇల్లు చేరుకునేసరికి గంట ఎనిమిదిన్నరయింది. ఆ పాటికి జానకి మూలముసుగు పెట్టుకుని కంటికి కడివెడుగా ఏడుస్తూంటుందని నేననుకున్నాను. కాని నా అంచనా తారుమారయింది. గదులన్నిటిలోనూ దీపాలు వెలుగుతున్నాయి. నడవలో చాప వేసుకుని జానకి అద్దం ముందు ముస్తాబు చేసుకుంటోంది. కురులు సన్నగా దువ్వి సొంపుగా జడ అల్లుకుని సిగనిండుకూ మల్లెపూలు పెట్టుకుంది. కళ్ళకు కాటుకద్దుకుంది. ఈమె నేను రెండుగంటల క్రితం చూచిన జానకి కాదు! ఇప్పుడామె ముఖం విచారమేఘాచ్ఛన్నం కాదు, అలాగని ఆ ముఖంలో నాకు మరేభావమూ ద్యోతకం కాలేదు. అది చిత్రాతిలా నిర్వికారంగా ఉంది.

"ఏమైందన్నయ్యా నువ్వు వెళ్ళినపని?" తనకు తానుగా జానకే ప్రశ్నించింది.

"పండు కాదు జానకీ! కాయే" అని నిట్టూర్చాను.

"ఇలా అవుతుందని నాకు తెలుసు" అంది జానకి.

కొండలు పిండిజేసి అలసిపోయిన వాడిలా నా కా రాత్రి ఎక్కడలేని నిద్ర వచ్చింది. ఎప్పుడు మంచంపైన మేను వాల్చానో, ఎప్పుడు నిద్రపట్టిందో నాకు తెలియదు. ఉన్నట్టుండి ఎవరో తట్టిలేపినట్లు మేల్కొన్నాను. వెన్నెల పాలార కాస్తోంది. ఇంట్లో చీమ చిటుక్కుమనడం లేదు. దాహంతో నాలుక పిడచకగట్టుకపోతోంది. "జానకీ, జానకీ" అని పిలిచాను. జానకి ఎక్కడ పడుకున్నట్టు? గది తలుపు తెరచి చూచాను. చాప ఖాళీగా ఉంది. నా గుండెల్లో రైల్సు పరుగెత్తాయి. చేజేతులా జానకిని మృత్యుదేవతకి అప్పగించిన పాపంనుంచి నే నెలా తప్పించుకోగలను? ఇటూ, అటూ చూచాను. వీధిలోకి పోదామనుకున్నాను. వీధి తలుపుకు వేసిన గడియ వేసినట్టే ఉంది. అయితే జానకి పెరట్లోకి వెళ్ళిందన్నమాట! నాలు గంగల్లో పెరట్లో పడ్డాను. బావికి పదిబారల్లో ఓ గంగరావిచెట్టు ఉంది. జానకి చెట్టుక్రింద నిలబడి శూన్యంగా కొమ్మలకేసి చూస్తోంది.

"ఇంత రాత్రివేళ ఇక్కడేం చేస్తున్నావ్ జానకీ?" అన్నాను, కాదు ఆక్రోశించాను.

"అది కాదన్నయ్యా! నే నొకమాట అడుగుతాను. నేను బ్రతికి మాత్రం లాభమేముంది చెప్పు?" అంది జానకి.

"లాభనష్టాల బేరీజులు నాకు తెలియవు జానకీ! ఈ ప్రాణాలు మనం సంపాదించుకున్నవి గావు. ప్రాణాల్ని ధారపోయడానికి మనకు హక్కులేదు".

"బ్రతికితే లోకం నవ్వుతుంది".

"కాని చస్తే లోకం ఏడవదు. బాగుపడితే కళ్ళజూడని, చెడిపోతే చేరదీయని గుడ్డిలోకంతో మనకు ప్రసక్తి లేదు".

"నువ్వు పిచ్చివాడివి అన్నయ్యా!" అంది జానకి.

"నాకు కాదు జానకీ! ప్రపంచానికి పిచ్చి. మనం అన్నా చెల్లెళ్ళలా ప్రవర్తిస్తే ప్రపంచం ఏమనుకుంది? ఏమైనా సరే, జానకీ, నేను లోకుల్ని లక్ష్యపెట్టను. ఈ క్షణం నుంచీ నువ్వు నా చెల్లెలివి. ఎన్ని కష్టనష్టాలెదురైనా నీకు నేను బాసటగా నిలుస్తాను. అయితే నువ్వొక మాట ఇవ్వాలి."

"మాటా అన్నయ్యా?"

"అవును, ఏ పరిస్థితుల్లోగానీ నువ్వు ఆత్మహత్యకు తలపెట్టకూడదు".

జానకి పెదవులపైన హాసరేఖ ఒకటి స్పష్టాస్పష్టంగా భాసించింది. ఆకసంలో చందమామ కద్దువస్తున్న దూదిపింజల్లాంటి మబ్బులు అప్పటికప్పుడే తేలిపోతున్నాయి. పూచిన సంపంగితో పెరడంతా గుబాళిస్తోంది. ఇద్దరమూ ఇంటి లోపలికి వెళ్ళాము. జానకి గదిలో పడుకుంది. శృంఖలాలు తెగిపోయి బంధవిముక్తి పొందిన ఖైదీకిలా నాకు నిశ్చింతగా నిద్రపట్టింది. నిద్రపోతుండగానే తెల్లవారి ప్రొద్దు ఏడెనిమిది బారలెక్కింది. నేనే ఆలస్యంగా నిద్ర లేచాననుకుంటే జానకి ఇంకా నిద్రపోతోంది. లేచి "నిన్న సాయంత్రమెప్పుడో తిన్న తిండి జానకీ! కడుపులో కొక్కులు తవ్వుతున్నాయి" అన్నాను. జానకి అదరాబాదరా గిన్నెలూ చెంబులూ కడుక్కురావడానికి పెరట్లోకి వెళ్ళింది...

✧ ✧ ✧

"బాబుగారూ, బాబుగారూ!"

"ఏం, ఏమొచ్చింది?" అన్నాడు సూర్యం.

"ఆ ముసలాడు మిమ్మల్నొకసారి చూడాలంటున్నాడు" అన్నాడు రాముడు.

"ఎందుకూ?" అంటూ సూర్యం గది తలుపు తెరిచాడు.

"ఆ మాట చెప్పడం లేదు. అసలు మన ఇంటికి వచ్చినప్పటినుంచి వాడికి ఒంట్లో బాగులేనట్టుందండీ! మందూ, మాకూ లేదేమో ఈనాటికి రోగం ముంచుకొచ్చేసింది.

"ఇప్పుడు నాకు తీరికలేదు. వీలైతే రేపుదయం వచ్చి చూస్తానని చెప్పు" అని సూర్యం తలుపు వేసేయబోయాడు.

"నాన్నా, నేనొస్తున్నాను" అంది మేడ మెట్లపైనుంచి పాప.

"వద్దు, క్రిందికి వెళ్ళిపో రాముడూ! పాపను తీసికెళ్ళు" అన్నాడు సూర్యం.

"ఉఁ హు. నేను క్రిందికెళ్ళను. అమ్మ నీ దగ్గరి కెళ్ళమంది" అంటూ పాప పైకొచ్చేసింది.

"అమ్మాయి 'గడ్డంతాత ఏమయ్యా'డని అమ్మగార్ని వేధిస్తోంది బాబూ! అందు కామె మిమ్మల్ని అడగమన్నట్టుంది" అన్నాడు రాముడు.

"సరేసరి! అందరికీ ఆ ముసలాడి గొడవే కావలసి వస్తోంది గాని, నువు పాపని తీసుకెళ్ళు నాకు పనుంది" అన్నాడు సూర్యం.

రాముడు పాప నెత్తుకుని క్రిందికి వెళ్ళిపోయాడు.

✧ ✧ ✧

"జానకికి నవమాసాలు నిండాయి. హాస్పిటల్లో చేర్చాను. సుఖప్రసవం జరిగింది. మగబిడ్డ. తల్లినీ, బిడ్డనూ చూడ్డానికి చాలా కొద్దిమంది వచ్చారు. వాళ్ళల్లో రంగమ్మ ఒకతె. "నీ కాపురాన్ని నిలబెట్టింది నేను" అని రంగమ్మ జానకితో సగర్వంగా చెప్పుకుంది. బిడ్డను చేతుల్లోకి తీసుకుని ముక్కూ, మొగమూ పరీక్షగా చూచి "బిడ్డ అంతా చంద్రం పోలికే" అంది. నేను నవ్వాను. జానకి నవ్వలేదు. ముఖాన్ని పమిటచెరగులో కప్పుకుని దుఃఖోద్వేగాన్ని దాచుకోడానికి ప్రయత్నించింది.

ఊళ్ళో ఉన్న నాన్నగారికి కబురెలా అందిందో గానీ, ఆయన రామబాణంలాంటి ఉత్తరం వ్రాశారు. "నువ్వు చేసిన ఘనకార్యాన్ని గురించి ఎంతో సంతోషించాను. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని నువ్వీ జాబు చేరిన తక్షణం వచ్చి ఇల్లు చేరుకుంటే మంచిది. లేకుంటే నేను తండ్రినీ గాను. నువ్వు కొడుకువీ కావు".

కాలేజిలో సెకండ్ టర్మ్ జీతం కట్టవలసిన వ్యవధి దాటిపోవస్తోంది. చేతిలో పైసాలేదు. ఫీజు చెల్లించకపోతే పేరు తీసేస్తారు. కాలుగాలిన పిల్లిలా ఇల్లు, కాలేజి, హాస్పిటళ్ళ మధ్య తిరుగుతున్నాను. జానకి నా వాలకాన్ని పసిగట్టి "ఏమిటన్నయ్యా! హోటల్లో భోజనం సరిపడ్డం లేదా?" అంది.

"భోజనం సంగతికాదు జానకీ! చదువు మానేసి ఏదైనా ఉద్యోగంలో చేరదామనుకుంటున్నాను," అన్నాను.

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? డబ్బు అవసరం గదా!"

"చదువు మానేస్తే నా మీద ఒట్టే అన్నయ్యా! ఆరు నూరు గానీ, నూరు ఆరుగానీ నువు చదువు మానుకోకూడదు. అమ్మ నాకీ చెయిను మిగిల్చిపోయింది. దీన్ని తీసుకెళ్ళి అమ్మేయి. మూడొందల రూపాయలు చేతికొస్తాయి. ఈ సంవత్సరం గడిచిపోతుంది. ఆ తరువాత దేవుడున్నాడు. అంతగా అవసరమైతే ఉన్నపొలంలో కొంతకు కొంత అమ్మేస్తే సరిపోతుంది" అంది జానకి.

"నీ నగల్నీ, నీ పొలాన్నీ అమ్మి చదువుకోమంటావా జానకీ! అవి కూడా లేకపోతే నీ గతీ, నీ బిడ్డ గతీ ఏం కావాలి?" అన్నాను.

"వీడు నా బిడ్డని నేననుకోడం లేదన్నయ్యా! వీడికి నువ్వున్నావు. నేను లేను. లేదులేదంటే వీడు పాలు మరచిపోయేంత వరకైనా బ్రతుకుతానో, బ్రతకనో".

"అలా అనకు జానకీ! నేను వినలేను" అంటూ ముఖం మరోవైపుకు త్రిప్పుకున్నాను. కానీ ఏ సంఘటనకు సంబంధించిన మాటనయితే నేను వినలేక పోయానో, అదే సంఘటనని రెండేళ్ళు తిరక్కముందే కళ్ళారా చూడ్డం తటస్థించింది. ఆ రెండేళ్ళ సహజీవనంలో నేను జానకిలో జానకిని చూడలేదు! మూర్తీభవించిన వైరాగ్యాన్ని చూచాను.

✧ ✧ ✧

ఆ రోజు పూర్ణిమ. అయినా నాకు అమావాస్య. ఉదయగిరిపైన అరుణరాగం అలముకుంటోంది. జానకి అస్థిపంజరంలా మంచాన్ని అంటిపెట్టుకుపోయి ఉంది. నేను బాబు నెత్తుకుని మంచం ప్రక్కన నిలబడ్డాను. జానకి నన్ను తలగడదగ్గర కూర్చోమంది. కూచున్నాను. తన తలను పైకెత్తి నా ఒడిలో పెట్టుకోమంది. "అన్నయ్యా! మనం బాబు కింకా పేరుపెట్టలేదు. ఏమని పిలుస్తావు?" అంది.

"ఏమని పిలవమంటావు జానకీ" అన్నాను.

"మా నాన్నగారి పేరు సూరయ్య. బాబుని సూర్యానారాయణ అని పిలుస్తావా అన్నయ్యా?"

"పిలుస్తాను జానకీ! తప్పకుండా పిలుస్తాను".

కొంతసేపు మౌనం. మళ్ళీ జానకి నోరు తెరిచింది.

"అన్నయ్యా! నువ్వు తప్పక పెళ్ళిచేసుకుంటావు గదూ?"

ఏం చెబుతాను నేను! మునిపళ్ళతో పెదవి గట్టిగా కొరుక్కుంటూ సజలనయనాలతో జానకిని చూస్తున్నాను.

"ఇంకొక్క మాట మాత్రమే అన్నయ్యా!".....

"చెప్పు జానకీ!" అన్నాను.

"నాకు తెలుసు, వాసు కెప్పటికైనా బుద్ధొస్తుంది. అతగాడు ఆస్తిని గుల్ల చేసేస్తాడు. చిప్ప చేతికొస్తుంది. అప్పుడు మనిషిగా మారుతాడు. అందాకా నువ్వతణ్ణి క్షమించొద్దులే అన్నయ్యా! అప్పుడైనా అతణ్ణి క్షమించవూ?"

"ఇదేం విచిత్రమైన కోరిక జానకీ! ఈ ప్రపంచంలో అతణ్ణి నీకంటే ద్వేషించవలసిన వాళ్ళెవరూ లేరు. నువ్వే అతణ్ణి క్షమిస్తున్నావు. ఇక నాదేముంది?"

బాబును తన దగ్గర పడుకోబెట్టమంది జానకి. శక్తి ఉన్నంత వరకూ శుష్కహస్తాలతో వాడి ఒళ్ళంతా నిమిరింది. క్రమక్రమంగా ఆమె కళ్ళు మూసుకపోయాయి. నేను గదిలోకి వెళ్ళి పళ్ళరసం తెచ్చాను. బలవంతాన నోరు తెరచి రెండు గ్రుక్కలు త్రాగించాను. మూడో గ్రుక్కకు జానకి తేలకళ్ళు వేసింది. నోరు బిగుసుకపోయింది. నా చేతిలోనుంచి గ్లాసు టంబ్లరు క్రిందపడి ముక్కలయింది.

జానకి చనిపోయింది.

జానకి జీవితం ఒక విషాదగీతం! కాని అది ఆపాతమధురమైన విషాదగీతం. వింటుంటే ఏదో అనిర్వచనీయమైన విషాదానుభూతి కలుగుతుంది. కానీ ఎంతసేపు విన్నా ఇంకా వినాలనే ఉంటుంది.

కథ అయిపోయింది సూర్యం! జానకి చనిపోయి ఇరవై యెనిమిదేళ్ళు కావస్తున్నాయి. నీకిప్పుడు ముప్పై యేళ్ళు.

బి.యల్. చదువు పూర్తిచేసి పెళ్ళి చేసుకున్న కొత్తలో ఓసారి నేను అనంతపురం వెళ్లాను. ఒకానొక మారుమూల హోటల్లోనుంచి బయటికొస్తూ వాసు కనిపించాడు. మనిషి చిక్కిపోయాడు. కళ్ళు లోతుకుపోయాయి. పాదాల దగ్గర చిరుగులు పడ్డ పైజామాపైన మాసిన పొట్టిచేతుల చొక్కా వేసుకున్నాడు. పెదవుల మధ్య బీడీ కాలిపోతోంది.

ఒక స్నేహితుడి ద్వారా తెలిసింది. వాసు ఆస్తిపాస్తులన్నీ పేకాటలో, త్రాగుడులో, మిగిలిన దుర్వ్యసనాల్లో కర్పూరంలాగా హరించుక పోయాయని!

ఓ సారి తిరుపతి నుంచి ధర్మవరానికి ప్రయాణం చేస్తున్నాను. కదిరి స్టేషనులో రైలు ఇంజనుకు నీళ్ళుపోసుకోడానికి పదిహేను నిమిషాలపాటు ఆగింది. మసకమసకగా సంజచీకట్లు క్రమ్ముకుంటున్నాయి. ప్లాటుఫారంపైన బీడీలు, సిగరెట్లు, ఆకులూ, వక్కలూ అమ్ముకుంటూ ఒకడు నడుస్తున్నాడు. బాగా పరకాయించి చూచిగాని గుర్తుపట్టలేకపోయాను. గడ్డం పెరిగివుంది. గుండీల్లేని చొక్కాలోనుంచి బొక్కి రొమ్ము కనబడుతోంది. వెంట్రుకలప్పుడే నెరసిపోతున్నాయి.

నాలుగేళ్ళక్రితం అనుకుంటాను. మండు వేసంగిలో ఒక మధ్యాహ్నాం హిందూపురం బస్స్టాండులో చింతచెట్టు క్రింద నిలబడి బస్సుకోసం నిరీక్షిస్తున్నాను. ఒక వృద్ధుడు దగ్గరికి వచ్చి చేయి చాచాడు. "బాబూ! మొండివాణ్ణి" అన్నాడు. నిజమే. ఎడమచేయి మోచేతి వరకూ లేదు. కానీకోసం జేబులో చేయివేస్తూ బిచ్చగాడి ముఖంలోకి చూచాను. జీబురు గడ్డంతో, చింకి పేలికల ఆచ్ఛాదనతో, క్రుంగి కృశించిపోయిన ఆ ఆకారంలో కలలో కనిపించినట్టు నాకు లీలామాత్రంగా ముప్పై యేళ్ళనాటి వాసు కనిపించాడు.

"ఇదిగో – నీ పేరేమిటి?" అని అడిగాను.

వాసు నన్ను పోల్చుకున్నాడు. చాచిన చేతిని వెనక్కి తీసుకుని వెనుదిరిగి చూడకుండా బూడిద దుమ్ములో నడుస్తూ దూరంగా వెళ్ళిపోయాడు.

మేమీ యాత్రకు బయలుదేరుతున్న సమయంలో అతణ్ణి చివరిసారిగా చూశాను. ఎనిమిది గంటలకు కదలబోతున్న యాత్రా స్పెషలుకు రాహుకాలం వస్తుందని మనం ఇంటిదగ్గర అయిదున్నరకే బయలుదేరాము. నేనూ, మీ పిన్నీ కారులో వెనక సీటులో కూచున్నాము. నువ్వు కారు డ్రయివు చేస్తున్నావు. నువ్వు చూచావో లేదో నాకు తెలియదు. కారు గేటు దాటుకుని రోడ్డులోకి రాబోతోంది. దారిప్రక్కన వాసు కాలపురుషుని కుంచెలో అనేక మార్పులకు లోనైన వికృత స్వరూపంతో మళ్ళీ నాకు కనిపించాడు...

✧ ✧ ✧

కాగితాల్ని అలమారాలోకి విసరి సూర్యం తటాలున పైకి లేచాడు. తలుపు తెరచుకుని క్రిందికి పరుగెత్తాడు. మేడమెట్ల దగ్గర నీరజ ఎదురై "మీ కోసం పైకొస్తున్నాను. మనం అనుకున్నంతా అయింది. హాస్పిటల్లోనుంచి ఇప్పుడే ఫోను చేశారు" అంది.

"అదీ అయిపోయిందీ!" అంటూ సూర్యం కుప్పకూలలా వాలుకుర్చీలో కూలిపోయాడు.

• *భారతి మాసపత్రిక 1957* •